
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 6 జూన్ 2024 | 5



సెంట్రల్ జైలులోకి వెళుతూ.. తర్వాత బయటకు వస్తూ.. (ఫైల్ ఫొటోస్)

రికార్డుల మోత!

- ఎన్నికల ఫలితాల్లో 'మెజార్టీ' రికార్డులు
- గత ఎన్నికల్లో ఎప్పుడూ రానంతగా నమోదు
- ఉమ్మడి 'తూర్పు'లో ఏడు నియోజకవర్గాల్లో 50వేలకుపైనే దాటేసిన ఆధిక్యతలు
- కాకినాడ రూరల్‌లో అత్యధికంగా పంతం నానాజీకి 72వేలపైనే మెజార్టీ
- ఆ తర్వాత రాజమహేంద్రవరం సిటీ 71వేలు, పిఠాపురంలో 70వేలపైమాటే
- రాజమహేంద్రవరం రూరల్, కాకినాడ సిటీ, కొత్తపేట, జగ్గంపేటల్లోనూ రికార్డుల మోతే
- ఈ నియోజకవర్గాల్లో ఐదేళ్లలో శృతిమించిపోయిన వైసీపీ అరాచకాలు, అక్రమాలు
- అధికారం అండతో యథేచ్ఛగా దోపిడీ, దౌర్జన్యాలు, బూతుల దండయాత్రలు
- చంద్రబాబును జైలుపాలు చేయడంతో వైసీపీని ఈడ్చికొట్టిన రాజమహేంద్రవరం ప్రజలు
- కాకినాడ సిటీ, కొత్తపేటల్లో అవినీతికి వైసీపీ ఎమ్మెల్యేలపై జనంలో తీవ్ర తిరుగుబాటు
- సీఎం జగన్ సామాజికవర్గం సాకుతో ఐదేళ్లుగా వీరిద్దరి అరాచకాలపై జనాగ్రహం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ప్రజలు టీడీపీ కూటమికి ఓట్ల వరద సృష్టించారు. అవినీతి, అక్రమాలతో నిండా మునిగిపోయి ప్రజల స్వేచ్ఛను హరించేసిన వైసీపీని ఉతికి ఆరేశారు. ఈవీఎంలపై కసిగా నొక్కి ఫ్యాన్‌ను భూస్థాపితం చేశారు. దీంతో టీడీపీ, జనసేన నుంచి పోటీచేసిన అభ్యర్థులు కనివినీ ఎరుగని మెజార్టీలతో నియోజకవర్గాల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రజలు ఇచ్చిన ఏకపక్ష తీర్పుతో ఇది వరకు ఎమ్మెల్యేలుగా నెగ్గిన అభ్యర్థుల గత రికార్డులు సైతం తుడిచిపెట్టుకుపోయాయి. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో కూటమి అభ్యర్థులంతా వేలాది ఓట్ల మెజార్టీలతో గెలుపొందారు. కానీ వీటిలో ఉమ్మడి జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో మాత్రం ఓటర్లు వైసీపీపై ఒకరకమైన కసి, కోపంతో కూటమికి ఓట్ల వరద పారించారు. మిగిలిన నియోజకవర్గాలతో పోల్చితే అంతుచిక్కనంత అనూహ్య మెజార్టీలు కట్టబెట్టారు. అంతా కూడబలుక్కునట్టు ఉప్పెనలా కదిలి ఓట్లేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కాకినాడ రూరల్, రాజమహేంద్రవరం సిటీ, పిఠాపురం, రాజమహేంద్రవరం రూరల్, కాకినాడ సిటీ, కొత్తపేట, జగ్గంపేట నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులు ఏకంగా 50 వేల నుంచి 72వేలకుపైగా మెజార్టీలు దక్కించుకున్నారు. ఒకరకంగా చెప్పాలంటే గత ఏ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ నియోజకవర్గాల నుంచి నెగ్గిన ఎమ్మెల్యేలకు ఈ స్థాయి మెజార్టీలు రాలేదు. కానీ ఇప్పుడు ఏ నియోజకవర్గాల్లోనూ లేనివిధంగా ఇక్కడే సరికొత్త రికార్డు ఆధిక్యతలు రావడానికి కారణాలేమిటనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.



పంతం నానాజీ (జనసేన)	ఆదిరెడ్డి శ్రీనివాస్ (టీడీపీ)	పవన్‌కల్యాణ్ (జనసేన)	బుచ్చయ్యచౌదరి (టీడీపీ)	వనమాడి కొండబాబు (టీడీపీ)	బండారు సత్యానందరావు (టీడీపీ)	జ్యోతుల నెహ్రూ (టీడీపీ)
మెజారిటీ : 72,040	మెజారిటీ : 71,404	మెజారిటీ : 70,279	మెజారిటీ : 64,090	మెజారిటీ : 56,573	మెజారిటీ : 56,479	మెజారిటీ : 52,676

(కాకినాడ/రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో అధికార వైసీపీ నేతలు ఈ అయిదేళ్లలో అధికారం అడ్డుపెట్టుకుని సాగించిన దురాగతాలు, బెదిరింపులే ఈ స్థాయిలో ప్రజలు స్పందించడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఆ కోపమే కూటమి అభ్యర్థులకు ఓట్ల వర్షం కురిపించిందనే చర్చ జరుగుతోంది. కాకినాడ రూరల్‌లో మాజీ మంత్రి కన్నబాబు అధికారం అండతో అవినీతితో రెచ్చిపోయారు. కుటుంబం మొత్తం నియోజకవర్గాన్ని జుర్రేశారు. దీంతో ఇక్కడ అవినీతిపై ప్రజలకు విసుగొచ్చేసింది. ప్రతి పనికి రేటు నిర్ణయించేసి సదరు నేత కోట్లకు పడగలెత్తారు. అలాగే ఇక్కడ ఎన్నికల ప్రచారం చేసిన పవన్ ఎమ్మెల్యే కన్నబాబు అవినీతిపై విరుచుకుపడ్డారు. ఒకప్పుడు డొక్కు సైకిల్‌పై తిరిగిన కన్నబాబు, ఇప్పుడు వెయ్యి కోట్లు సంపాదించారని ఆధారాలతో ఆరోపించారు. ఇక్కడ జనసేన అభ్యర్థి పంతం నానాజీకి ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా ఏకంగా 72వేలకుపైగా మెజార్టీ వచ్చేలా చేసింది. అటు రాజమహేంద్రవరం సిటీలో ఆదిరెడ్డి వాసు టీడీపీ నుంచి 71 వేలకుపైగా మెజార్టీతో నెగ్గారు. నిజానికి రాజమండ్రి సిటీలో, రూరల్‌లోనూ పోలింగ్ శాతం తక్కువ నమోదైంది. అయినాగానీ ఇక్కడ భారీ మెజార్టీలు వచ్చాయి. పోలింగ్ శాతం పెరిగితే ఇంకెంత మెజార్టీ వచ్చేదో మరి. ఇదో కొత్త చరిత్ర. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే టీడీపీ నుంచి ఆదిరెడ్డి భవానీ ఉన్నారు. కానీ అధికారంలో ఉన్నది వైసీపీ కావడంతో ఆ పార్టీ ఎంపీ భరత్ తన వ్యవహార శైలితో రాజమహేంద్రవరం ప్రజల్లో వైసీపీపై ఒకరకమైన ఏహ్యభావం కలిగించేలా చేశారు. అవినీతి ఆరోపణలు, రెచ్చగొట్టే బూతులు, సాధ్యంకాని హామీలతో నవ్వులపాలయ్యారు. అలాగే ఆదిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని జగన్ ప్రభుత్వం అరెస్టులు చేయడం, వారి వ్యాపారాలపై దెబ్బకొట్టడం ప్రజల్లో ఆదిరెడ్డి కుటుంబంపై సానుభూతి పెంచింది. అన్నింటికీ మించి స్కిల్ కేసులో అక్రమంగా అరెస్టైన చంద్రబాబును నెలల తరబడి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉంచడంతో ఇక్కడి ప్రజలు వైసీపీ అరాచకాలను నేరుగా చూశారు. దీంతో ఎన్నికల్లో ఓటుతో వైసీపీని కసితీరా చితక్కొట్టారు. రాజమండ్రి రూరల్ నుంచి కూటమి తరపున టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి ఆయనకు ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి మంత్రి వేణుకంటే 64,090 ఓట్లు మెజార్టీ లభించింది. 11సార్లు ఎన్నికల్లో పోటీచేసిన గోరంట్ల 7వసారి అసెంబ్లీకి ఎన్నికై మరో రికార్డు సృష్టించారు. పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌ను ఓడించడానికి వైసీపీ పన్నని కుట్రలు, కుతంత్రాలంటూ లేవు. కడప నుంచి బృందాలు రావడం, కోట్లు కుమ్మరించడం ఇవన్నీ ప్రజల్లో వైసీపీపై అసహ్యాన్ని పెంచాయి. ఎన్నికల చివరి రోజు జగన్ సభ, ఎమ్మెల్యే అభ్యర్థి గీత ఏడుపు నటనలు జనంలో వైసీపీపై నిలువెత్తు కోపం పెంచాయి. ఇదంతా పవన్‌పై అక్కసుతోనే అని గ్రహించారు. రాజమహేంద్రవరం రూరల్‌లో టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేగా బుచ్చయ్యచౌదరి ఉన్నారు. కానీ ఇక్కడకు వైసీపీ అభ్యర్థిగా అవినీతిలో మునిగిపోయిన మంత్రి వేణు రామచంద్రపురం నుంచి బదిలీపై రావడం మైనస్‌గా మారిపోయింది. పైగా ఇక్కడ వైసీపీ సాగించని అవినీతింటూ లేకుండా పోయింది.

పార్లమెంటు అభ్యర్థులకూ భారీ మెజారిటీలు

ఇక పార్లమెంట్ కూటమి అభ్యర్థిగా గెలిచిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎన్టీఆర్ కూతురు దగ్గుబాటి పురందేశ్వరికి 2,39,139 ఓట్ల మెజార్టీ లభించింది. జిల్లాలో గతంలో ఎన్నడూ ఎవరికీ ఇంత మెజార్టీ లభించలేదు. గతంలో టీడీపీ ఎంపీగా గెలిచిన మాగంటి మురళీమోహన్ లక్షా 60వేల ఓట్లు సాధించి రికార్డు సాధించగా, పురందేశ్వరి ఆ రికార్డును కూడా బ్రేక్ చేశారు. అలాగే అమలాపురం పార్లమెంటు టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన గంటి హరీష్‌మాధుర్ (బాలయోగి)కి 3,42,196 ఓట్ల మెజారిటీ లభించింది. ఇది కూడా ఒక చరిత్రే. కాకినాడ పార్లమెంటు జనసేన కూటమి అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించిన తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు 2,29,491 ఓట్ల మెజారిటీ లభించింది. మొత్తానికి కాకినాడ, అమలాపురం, రాజమండ్రి పార్లమెంటు స్థానాల నుంచి మెజారిటీల విషయంలో భారీగా రికార్డుల మోత మోగించారు.

వారిద్దరి అరాచకం అంతా ఇంతా కాదు...

కాకినాడ సిటీ, కొత్తపేటల్లో వైసీపీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి, జగ్గిరెడ్డి ఇద్దరూ అవినీతికి నిలువెత్తు రూపాలుగా మారారు. ఈ అయిదేళ్లలో నియోజకవర్గాలను వీరిద్దరు పీల్చి పిప్పిచేసినంతగా మరెవరూ చేయలేదు. ఇసుక, మట్టి గ్రావెల్ దోపిడీలు, సెటిల్‌మెంట్లు, దందాలు, రౌడీయిజం, ప్రశ్నించే వారిపై కేసులు, దాడులతో ద్వారంపూడి, జగ్గిరెడ్డి చెలరేగిపోయారు. వీరిద్దరిదీ సీఎం సామాజికవర్గం కావడంతో తమకు ఎదురేలేదన్నట్టు వ్యవహరించారు. అయిదేళ్లలో వందల కోట్లు సంపాదించారు. ప్రజలకు ఏ చిన్నమేలు చేయకపోవడం ఒకెత్తయితే ప్రతి పనికి రేటుతో చెలరేగిపోయారు. వీటన్నింటితో విసుగెత్తిపోయిన ప్రజలు ఓటుతో చాచికొట్టారు. నియంతల్లా వ్యవహరిస్తున్న వీరిద్దరినీ ఓటుతో కసిదీరా కొట్టి టీడీపీ అభ్యర్థులకు అఖండ ఓట్ల మెజార్టీ కురిపించి తమ కోపం చల్లార్చుకున్నారు. జగ్గంపేటలో సైతం సిట్టింగ్ ఎమ్మెల్యే చంటిబాబు అవినీతికి హద్దుల్లేకుండా పోయింది. దీంతో ఇక్కడ కూడా ఆ పార్టీని నామరూపాల్లేకుండా జనం చీల్చిచెండాడేశారు. అదే రీతిన కురసాల కన్నబాబుకు గట్టి షాక్ ఇచ్చారు.



ఆ పాపమే పెను శాపమై..

- సెంట్రల్ జైలులో చంద్రబాబు
- అక్రమంగా 53 రోజులు బంధించిన జగన్
- ఆ క్షణం నుంచే ఓటరులో మౌన వేదన
- సమయం చూసి ఓట్లతో కొట్టారు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జగన్ చేసిన ఆ పాపాలే వైసీపీ పాలిట పెను శాపాలై వెంటాడి వేటాడాయి. ఆ పాపాలకు గత ఏడాది సెప్టెంబరు 10 పరాకాష్ఠ. రాష్ట్రానికి చీకటి రోజు. రాజకీయ కక్షతో రగిలిపోయిన జగన్.. చంద్రబాబును అక్రమ కేసులో ఇరికించి రాజమండ్రి సెంట్రల్ జైలులోని స్నేహ బ్లాక్‌లో బంధించిన రోజు. ఆనాటి ప్రజల కన్నీరే ఓటు రూపంలో వైసీపీపై వేటు వేసింది. ప్రజాతీర్పులో వంచకులు కొట్టుకుపోక తప్పలేదు. చంద్రబాబును సీబీసీఐడీ అరెస్టు చేసిన క్షణం నుంచీ జనం కళ్లల్లో ఉబికివచ్చిన కన్నీరు ఇంకిపోయి కసిగా మారింది. చంద్రబాబు వయసు, రాజకీయ ప్రయాణం, సుదీర్ఘ అనుభవం, సంపదను సృష్టించే సామర్థ్యం.. ఏదీ వైసీపీ వారి కళ్లకు కనిపించలేదు. ఒకే లక్ష్యం.. చంద్రబాబును జైలుకు పంపడం. పైశాచిక ఆనందాన్ని పొందడం. అయితే, కాలం ఊరుకున్నా ఓటరు ఊరుకుంటాడా. సరిగ్గా 8 నెలల 2 రోజులు పంటి బిగువున అదిమి పట్టుకున్న అభిమానం అగ్నిపర్వతమై జగన్నాటకాన్ని దహించేసింది. చంద్రబాబు జైలులో ఉన్న రోజులు నిజంగా ఓ చరిత్ర. ఆయన భద్రతపై జనం ఎంత భయపడుతున్నా ఆ 'లీడర్' మాత్రం నిండుకుండలా ఒక్క క్షణం కూడా తొణికిసలాడలేదు. పైగా జైలు నుంచే ప్రజలకు ధైర్యం చెప్పారు. కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. ఖైదీలు సైతం ఆయనతో మాట్లాడడానికి ఎంతో ప్రయత్నించారు. తమ గోడు వెళ్లబోసుకోవడానికి చూశారు. కానీ అవకాశం దక్కలేదు. జైలు రోడ్డులో వెళ్లే వాళ్లలో ఆవేదన కనిపించేది. పది మంది గుమిగూడి, హడావుడి కనిపిస్తే.. 'బాబు బయటకు వస్తున్నారా' అనే ప్రశ్న వినిపించేది. చిన్న పనులు చేసేవాళ్ల దగ్గర నుంచి ఐటీ ఉద్యోగుల వరకూ విదేశాలు, వివిధ రాష్ట్రాల నుంచి రాజమండ్రి వచ్చి జైలు గోడలవైపు దీనంగా చూస్తూ నిశ్శబ్దంగా ఆవేదన చెందేవారు. చంద్రబాబు సతీమణికి మనోధైర్యం చెప్పి బరువెక్కిన గుండెలతో వెనుదిరిగేవారు. నిర్మాణానికి తాను సీఎంగా ఉన్నప్పుడు నిధులు మంజూరు చేసిన 'స్నేహ బ్లాక్' 53 రోజులు మౌనంగా రోదించింది. ఇప్పుడు అక్రమార్కుల రాక కోసం ఎదురుచూస్తోంది నిశ్శబ్దంగా..



బీజేపీ ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతున్న దగ్గుబాటి పురందేశ్వరి

మిత్రపక్షంగా ఉంటూ ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి : పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్5: ప్రభుత్వంలో, కూటమిలో మనం మిత్రపక్షంగా ఉంటాం. కానీ ఎప్పటికప్పుడు ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉంది అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీగా గెలుపొందిన దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో రాజమండ్రి పార్లమెంట్ పరిధిలోని ముఖ్యనాయకులు, మండల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన గెలుపునకు కృషి చేసిన పార్టీ కేడర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో బీజేపీ, తెలుగుదేశం, జనసేన మూడు పార్టీలు కూటమిగా రావడం జరిగిందని, మూడు పార్టీల ఆలోచనా విధానాలు వేరైనా అద్భుతమైన సమన్వయంతో అనూహ్య ఫలితాలు సాధించగలిగామన్నారు. కూటమి పార్టీల సమన్వయం ఒక కేస్ స్టడీగా మనందరం తీసుకోవాలి అని గట్టిగా భావిస్తున్నానన్నారు. గత ప్రభుత్వంలో ప్రతిపక్ష సభ్యులను అసెంబ్లీకి రానీయకుండా, వారిని మాట్లాడనీయకుండా ఒక రకమైన వాతావరణం అసెంబ్లీలో కల్పించారు. ఇవాళ అసెంబ్లీలో ప్రతిపక్షం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మనమే ప్రతిపక్షంగా ప్రజలతో ఉంటూ, వారి సమస్యలను నిర్మాణాత్మకంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కచ్చితంగా ఉందన్నారు. మనకు పది అసెంబ్లీ సీట్లు ఇస్తే అందులో 8 గెలిచామని, ప్రజలు మనపట్ల విశ్వాసంతో ఓట్లు వేశారనే సంగతి గుర్తుంచుకోవాలని, అలాగే ప్రజల విశ్వాసం, మిత్రపక్షాల సహకారం గుర్తుపెట్టుకోవాలన్నారు. టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు చక్కగా సహకరించారని, బీజేపీ అభ్యర్థులకు సంపూర్ణ సహకారం అందించారన్నారు. ఐదేళ్ల కాలంలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా విస్మరించబడిందని, రాబోయే ఐదేళ్లలో ఎన్డీఏ కూటమి రాష్ట్రాభివృద్ధి దిశగా అడుగులు వేసి నిజమైన పాలన రాష్ట్రానికి అందిస్తామని ఆశిస్తున్నానని పురందేశ్వరి పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, కోడూరి లక్ష్మీనారాయణ, రొంగల గోపి, పరిమి రాధాకృష్ణ, కృష్ణభగవాన్ పాల్గొన్నారు.





వైసీపీ అంతిమ యాత్రలో జగన్ దిష్టి బొమ్మను చింపేస్తున్న దృశ్యం

వైసీపీ అంతిమ యాత్ర

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5 : రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభంజనంలో తుడుచుపెట్టుకుపోయిన వైసీపీకి రాజమహేంద్రవరంలో అంతిమయాత్ర జరిపారు. బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తిలక్‌రోడ్డులో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు ఆధ్వర్యంలో జగన్ దిష్టిబొమ్మను ఊరేగించి శవయాత్ర చేశారు. దీన్ని గమనించిన పోలీసులు వెంటనే అడ్డుకున్నారు. తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవీవరప్రసాద్ ఆధ్వర్యంలో కూడా ఫ్యానును బైక్‌కి కట్టి ఈడ్చుకెళ్లారు.

జనం.. భయపడిపోయారు!



- అరాచకాలతో అల్లాడిపోయారు
- పోలింగ్ రోజు తండోపతండాలుగా తరలివచ్చారు
- ఓ రైలుకు తొలిసారిగా గ్రీన్ చానెల్
- కసితో వైసీపీని ఇంటికి సాగనంపేశారు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లలో వైసీపీ నాయకుల అరాచకాలకు జనం భయపడిపోయారు. జగన్ అక్రమాలతో రాష్ట్రం అల్లాడిపోయింది. పోలింగ్ రోజున తండోపతండాలుగా పోలింగ్ స్టేషన్లకు వచ్చిన జనంలో ఓ బెరుకు, బాధ స్పష్టంగా కనిపించింది. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే.. వామ్మో ఇంకేమైనా ఉందా? అనే ఆందోళన సుదూరాల నుంచి కూడా తెలుగు ప్రజలు తరలివచ్చేలా చేసింది. ఎటు చూసినా అరాచకాలు. వైసీపీ నాయకుల బూతు పురాణాలు. శాసన సభ అంటే గౌరవం లేదు. ప్రజలంటే జవాబుదారీతనం లేదు. రాజ్యాంగానికి నీళ్లొదిలేశారు. అభివృద్ధికి అవినీతి చీడపట్టింది. సంక్షేమం పప్పూ బెల్లమైంది. జగన్ దగ్గర నుంచీ కింది స్థాయి నాయకుల వరకూ ఎలా దోచుకోవాలా? అనే ఆలోచనే తప్ప జనాల బాధలు పట్టించుకున్న దాఖలా లేదు. ఇవన్నీ చూస్తూ ఉన్న తెలుగు ప్రజల్లో గుండెలు మండిపోయాయి. పోలింగ్ రోజు కోసం మౌనంగా ఎదురుచూశారు. కొందరు విదేశాల నుంచి లక్షలు వెచ్చించి వచ్చారు. ఐటీ ఉద్యోగులు బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసల కోర్చి వచ్చారు. పోలింగ్ రోజుకు ముందు రెండు రోజుల నుంచీ ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలు, బస్సులు, రైళ్లలో కుంభమేళా, పుష్కరాల మాదిరిగా తరలివచ్చిన జనాలను చూస్తే కసి స్పష్టమవుతోంది. ఉమ్మడి జిల్లాకు సుమారు వెయ్యి ప్రైవేటు బస్సుల్లో ఓటర్లు వచ్చారని అంచనాలు వినవస్తున్నాయి. ప్రత్యేక బస్సులు వేయకుండా మన ఆర్టీసీని నిలువరించినా.. టీఎస్ఆర్టీసీ అదనంగా బస్సులు నడిపింది. తెలంగాణ నుంచి రానుపోను రోజుకు రూ.30వేల కిరాయి మాట్లాడుకొని మరీ కార్లలో జనం పోలింగ్ స్టేషన్లకు వచ్చారు. మే 13 పోలింగ్ రోజు. ఎప్పటి మాదిరిగానే నాందేడ్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ పరుగులు పెడుతోంది. అయితే సాధారణ సమయంకంటే 4గంటలు ఆలస్యంగా నడుస్తోంది. దీంతో ప్రయాణికుల్లో కలవరం మొదలైంది. సాయంత్రం 6గంటలలోపుగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లకపోతే ఓటు వేయలేమన్న ఆందోళన బయలుదేరింది. దీంతో ఎన్నికల సంఘానికి, రైల్వే ఉన్నతాధికారులకు.. ఇలా ఎవరికి తోచిన దారిలో వారు ఫిర్యాదు, విన్నపం పంపించారు. ఎన్నికల సంఘం తక్షణమే స్పందించి రైల్వే ఉన్నతాధికారులకు సూచన చేసింది. దాంతో ఆ రైలుకు గ్రీన్ చానెల్ ఏర్పాటుచేస్తూ అప్పటికప్పుడు నిర్ణయం తీసుకున్నారు. గూడ్స్‌రైళ్లను పక్కన పెట్టి ఆ రైలును పరుగులు పెట్టించారు. దీంతో సాయంత్రం 4.30 గంటలకు విశాఖ చేరుకొంది. పోలింగ్ రోజున ఓ రైలుకు గ్రీన్ చానెల్ ఏర్పాటుచేయడం బహుశా ఇదే మొదటిసారని చెబుతున్నారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విజేతలు

ప్రథమ బహుమతి: రూ.10వేలు

పి. సూర్యకుమారి
మురమండ, కడియం మండలం, తూర్పుగోదావరి జిల్లా.

ద్వితీయ బహుమతి: రూ.5వేలు

1. చిక్కాల భాస్కరరావు
మోరి, సఖినేటిపల్లి మండలం, కోనసీమ జిల్లా.
2. ఎస్. సత్యరామారావు
ఇంజరం, తాళ్ళరేవు మండలం, కాకినాడ జిల్లా.
3. అలజంగి నాగరాజు, రామచంద్రపురం.

డ్రా వివరాలు

...7లో

మళ్లీ ఇన్నాళ్లకు..

రంపచోడవరంలో 15ఏళ్ల తర్వాత టీడీపీ విజయం


శిరీషాదేవి

(రంపచోడవరం):తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఏజెన్సీ కంచుకోటగా ఉంది. అయితే రంపచోడవరంలో గత మూడు దఫాలుగా చవిచూసిన వైఫల్యాలను దాటి ఈ ఎన్నికల్లో ఊహించని రీతిలో తెలుగుదేశం పార్టీ మళ్లీ ఇక్కడ పాగా వేసింది. 1983లో దివంగత ఎన్టీ రామారావు సారథ్యంలో మన్యం ఓటర్లు తెలుగుదేశానికి పట్టం కట్టి 2004 వరకూ ఆరు సార్లు వరుస విజయాలను కట్టబెట్టారు. లోపం ఎవరిదైనప్పటికీ 2009లో ప్రారంభమైన వైఫల్యం 2019 వరకూ మూడు దఫాలుగా వరుసగా ఆ పార్టీని వెంటాడింది. ఓడిన ప్రతిసారీ అధిష్ఠానం ముఖ్యంగా అధినేత చంద్రబాబు సైతం ఎన్నో మార్పులను చేసినా ఫలితం రాలేదు. అయితే ఈ సారి మాత్రం 1983 మాదిరి ప్రభంజనంగా రాష్ట్ర వ్యాప్తంగా సునామీలా పార్టీ విజయకేతనం ఎగురవేయడంతో రంపచోడవరం కూడా దేశం ఖాతాలోకి తిరిగి వచ్చేసింది. 2009 ఎన్నికల్లో ఇక్కడ తొలిసారిగా తెలుగుదేశం ఓడిపోగా, 2014, 2019లలో కూడా అదే ఓటమి. 2019లో అయితే ఆ ఓటమి 39 వేల పైచిలుకు మెజారిటీతో ప్రత్యర్థి పార్టీకి విజయాన్ని తెచ్చిపెట్టింది. 2024 ఎన్నికల్లో పార్టీ దశ తిరిగింది. ఓటర్లు టీడీపీ వైపు ఆకర్షితులయ్యారు. మొత్తం 2,10,508 ఓట్లు నమోదు కాగా, టీడీపీ అభ్యర్థికి 90087 ఓట్లు వచ్చాయి. వైసీపీకి 80948 ఓట్లు వచ్చాయి. సీపీఎంకు అనూహ్యంగా 21265 ఓట్లు వచ్చాయి. మొత్తంగా టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీషాదేవి తన సమీప ప్రత్యర్థి నాగులాపల్లి ధనలక్ష్మిపై 9139 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

52 ఏళ్ల తర్వాత ఆ కుటుంబానికి ఎమ్మెల్యే గిరీ



ప్రత్తిపాడు, జూన్ 5: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన వరుపుల జోగిరాజు కుటుంబానికి మళ్లీ 52 ఏళ్ల తర్వాత ఎమ్మెల్యే పదవి వరించింది. 1972 ప్రత్తిపాడు అసెంబ్లీ ఎన్నికల్లో వరుపుల జోగిరాజు కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి ప్రత్యర్థి అయిన ఇండిపెండెంట్ అభ్యర్థి ముద్రగడ వీరరాఘవరావుపై విజయం సాధించారు. అనంతరం నాలుగున్నర దశాబ్దాల వరకు వరుపుల జోగిరాజు కుటుంబం నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేయలేదు. అయితే గత ఎన్నికల్లో దివంగత వరుపుల జోగిరాజు మనవడు వరుపుల రాజా టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి 4616 ఓట్ల తేడాతో ఓడిపోయారు. వరుపుల రాజా వారసురాలుగా ఆయన భార్య వరుపుల సత్యప్రభ ప్రస్తుత ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల బరిలో టీడీపీ ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచి ప్రత్యర్థి అయిన వైసీపీ అభ్యర్థి తాత వరుపుల సుబ్బారావుపై 38768 ఓట్ల మెజార్టీ తో విజయం సాధించారు. వరుపుల జోగిరాజు ఎమ్మెల్యే పదవి చేపట్టిన 52 ఏళ్ల తర్వాత ఆయన మనవడు భార్య సత్యప్రభ భారీ మెజార్టీతో కూటమి అభ్యర్థిగా విజయం సాధించడంతో మళ్లీ జోగిరాజు కుటుంబానికి రెండో సారి ఎమ్మెల్యే పదవి లభించింది.

అంగన్‌వాడీ కేంద్రం నుంచి అసెంబ్లీకి


సహచర సిబ్బందితో ఎమ్మెల్యే విజేత శిరీషాదేవి(సర్కిల్‌లో)

రాజకీయాల్లోకి వచ్చిన ఐదు నెలల్లోనే రంప ఎమ్మెల్యేగా గెలుపొందిన శిరీషాదేవి

(రంపచోడవరం): ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రాణించేందుకు మంచి విద్యార్హతలు ఉండి కూడా ఉన్న ఊరికే సేవ చేసే లక్ష్యంతో అంగన్వాడీ కార్యకర్తగా చిరు ఉద్యోగంలో చేరిన ఆమె ఊహించని రీతిలో రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఐదు నెలలకే రంపచోడవరం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు మిరియాల శిరీషాదేవి.. ఈ ఎన్నికల్లో రంపచోడవరం అసెంబ్లీ స్థానానికి ఎన్నిక కావడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఆమె పరిచయమయ్యారు.. బీఎస్సీ, బీఈడీ చేసిన ఆమె ఉపాధ్యాయ పోస్టుకు అర్హతలు అన్నీ ఉన్నా, తన గ్రామంలోనే ఉండి సేవ చేయడం కోసం అంగన్వాడీ ఉద్యోగాన్ని ఎంచుకున్నారు. ఉమ్మడి కుటుంబంగా అత్తవారి ఇంట ఉన్న ఆమెకు తన భర్త విజయభాస్కర్ తెలుగుదేశం పార్టీలో యువజన విభాగానికి నాయకుడు కావడంతో, 2024 ప్రారంభంలో రాజకీయాల్లోకి వచ్చి రంపచోడవరం అభ్యర్థిత్వం కోసం తెలుగుదేశం పార్టీకి దరఖాస్తు చేసుకున్నారు. ఎందరో సీనియర్లతో పోటీ పడిన ఆమె మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ప్రోత్సాహంతో రంపచోడవరం టీడీపీ అభ్యర్థిత్వాన్ని పొందడంతో పాటు విజయాన్ని కూడా కైవశం చేసుకున్నారు.

యనమల ఇంట పదవుల పంట


యనమల దివ్య


రామకృష్ణుడు


పుట్టా మహేష్


పుట్టా సుధాకర్

తొండంగి,జూన్ 5: టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఇంట ఈసారి పదవుల పంట పండింది. ఆయన పెద్ద కుమార్తె యనమల దివ్య తుని నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. ఆయన రెండో అల్లుడు పుట్టా మహేష్ ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేసి పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యారు. యనమల వియ్యంకుడు మాజీ టీటీడీ ఛైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గం నుంచి శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. యనమల శాసన మండలి ప్రతిపక్ష నేతగా కొనసాగుతున్నారు. యనమల ఇంట పదవుల పంట పండడంపై కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సత్యదేవుని సన్నిధిలో ఎమ్మెల్యే విజేతల పూజలు


ఆశీర్వచనం అందుకుంటున్న జ్యోతుల నెహ్రూ కుటుంబం


స్వామివారిని దర్శించుకున్న యనమల దివ్య

అన్నవరం, జూన్ 5: రత్నగిరిపై కొలువుదీరిన సత్యదేవుడి సన్నిధిలో నూతన ఎమ్మెల్యేలుగా గెలుపొందిన జ్యోతుల నెహ్రూ, యనమల దివ్య వేర్వేరుగా బుధవారం స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేసి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. జ్యోతుల నెహ్రూ వెంట దేవస్థానం మాజీ ట్రస్టీ కొత్త కొండబాబు, రిటైర్డ్ పీఆర్వో తులా రాముడు తదితరులుండగా, యనమల దివ్య వెంట దేవస్థానం పూర్వపు ట్రస్టీ యనమల రాజేష్ తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి కార్యాలయంలో 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' డ్రా


రాజమహేంద్రవరం ఆంధ్రజ్యోతి యూనిట్‌లో డ్రా నిర్వహిస్తున్న దృశ్యం

విజేతలు వీరే

ప్రథమ బహుమతి: రూ.10 వేలు
పి.సూర్యకుమారి, మురమండ, కడియం మండలం, తూర్పుగోదావరి జిల్లా

ద్వితీయ బహుమతులు ముగ్గురికి: రూ.5వేలు
1. చిక్కాల భాస్కరరావు, మోరి, సఖినేటిపల్లి మండలం, కోనసీమ జిల్లా.
2. ఎస్.సత్యరామారావు, ఇంజరం, తాళ్లరేవు మండలం, కాకినాడ జిల్లా.
3. అలజంగి నాగరాజు, రామచంద్రపురం

రాజమహేంద్రవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' పేరిట ఆంధ్రజ్యోతి నిర్వహించిన సర్వేకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 19 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏ పార్టీ గెలుస్తుందో అంచనాలు చెప్పాలంటూ జిల్లా ఎడిషన్లలో ఆరు కూపన్లు ప్రచురించింది. సుమారు వెయ్యి మందికిపైగా ఫలానా పార్టీ గెలుస్తుందంటూ పూర్తి చేసిన కూపన్లను రాజమహేంద్రవరంలోని 'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయానికి పంపించారు. మొత్తం 19 స్థానాల్లోనూ కూటమే విజయం సాధిస్తుందని సుమారు 200 మంది కచ్చితమైన అంచనాలను రాసి పంపారు. బుధవారం సాయంత్రం ఈ ఎంపిక చేసిన కూపన్ల నుంచి డ్రా తీసి నలుగురిని విజేతలుగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజరు ఎస్.శ్రీనివాసరావు, ఎడిషన్ ఇన్చార్జి బీహెచ్‌వీ మంగేష్, యాడ్స్ మేనేజరు సీహెచ్ కృష్ణారావు, సర్క్యులేషన్ మేనేజరు బి.గోపాలకృష్ణ, ప్రొడక్షన్ మేనేజరు రాజేంద్ర, సిస్టమ్స్ ఇన్‌చార్జి ఎన్.శివకుమార్, తూర్పుగోదావరి జిల్లా రిపోర్టింగ్ ఇన్‌చార్జి ఎస్ఎస్ఎన్ సత్యనారాయణ, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురం, జూన్ 5: పిఠాపురం ఎమ్మెల్యే విజేత, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ ఎన్ వర్మ కలిశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో పవన్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పవన్ మాట్లాడుతూ తన వెన్నంటి ఉండి జనసేన విజయం కోసం, తన విజయం కోసం కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే వర్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వర్మను వేదికపైకి పిలిచి ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. వర్మ పవన్‌ను సత్కరించి అన్నవరం ప్రసాదం అందజేశారు. పవన్ మాట్లాడుతూ వర్మను గుండెల్లో పెట్టి చూసుకుంటానన్నారు. తన గెలుపులో వర్మ కీలకపాత్ర పోషించారని తెలిపారు. టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలకు పవన్ ధన్యవాదాలు తెలిపారు.

10లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలి

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 5: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను తప్పనిసరిగా దగ్గరలో ప్రభుత్వ ఐటీఐలు కాకినాడ, జగ్గంపేట, అమలాపురం జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌ల్లో ఈనెల 10వతేదీ లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, డిస్ట్రిక్ట్ కన్వీనర్ ఎంవీజి వర్మ తెలిపారు. ఇప్పటివరకు 1284 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకోగా వారిలో 583 మంది విద్యార్థులు మాత్రమే వెరిఫికేషన్ చేయించుకున్నారన్నారు.

జూలై 20న ఆర్యాపురం కోఆపరేటివ్ పాలకవర్గం ఎన్నికలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5 : రాజమహేంద్రవరంలోని ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నెం 3127 పాలకవర్గం ఎన్నికలు జూలై 20న జరిపేందుకు నిర్ణయిస్తూ జిల్లా కలెక్టర్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారని ఎన్నికల అధికారి, కొవ్వూరు డివిజనల్ సహకార అధికారి వి.కృష్ణకాంత్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నామినేషన్ల స్వీకరణ జూలై 11 నుంచి ఉంటుందని, ఉపసంహరణ 13న, ఎన్నికలు 20న నిర్వహించడానికి ఆదేశించారని తెలిపారు. అర్హత గల ఓటరు జాబితాను తయారు చేయడానికి ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూలై 4న తుది జాబితాను ప్రకటించుటకు కార్యాచరణ చేపడుతున్నట్లు ఎన్నికల అధికారి కృష్ణకాంత్ తెలిపారు.

'రోజాకు సారె, చీర పంపిస్తున్నాం'


రోజాకు బహుమతిగా పంపనున్న సారె,చీర, స్వీట్లను చూపుతున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, జూన్ 5: వైసీపీ ప్రభుత్వం అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలతో విసిగి వేసారిన ప్రజలు చంద్రబాబు ఆధ్వర్యంలోని టీడీపీ కూటమికి అద్భుతమైన విజయాన్ని అందించారని కాకినాడ రూరల్ నియోజకవర్గం కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబి) అన్నారు. బుధవారం 47వ డివిజన్ కరణంగారి సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం కోసం లోకేశ్‌పై వైసీపీ నాయకులు అవహేళన చేసి మాట్లాడారని, చరిత్రలో ఎవరికీ రాని మెజారిటీ మంగళగిరిలో లోకేశ్‌కు వచ్చిందన్నారు. లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనిల్‌కుమార్ యాదవ్, రోజా తదితర మాజీ మంత్రులు ఎన్నికల్లో గాల్లో కొట్టుకుపోయారన్నారు. రోజాకి రాజకీయ భిక్ష పెట్టింది టీడీపీ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్ సమయంలో రోజా బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారన్నారు. చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారంతా పత్తాలేకుండా పోయారన్నారు. ఓటమిపాలైన రోజా అత్తారింట్లో కాపురం చేసుకునేందుకు టీడీపీ మహిళలు సిద్ధం చేసిన సారె, చీరలు, స్వీట్లను బహుమతిగా పంపుతున్నట్లు తెలిపారు. ఈ బహుమతులు స్వీకరించాలని కాకినాడ కాజా కూడా పంపుతున్నామన్నారు. త్వరలో అన్ని జిల్లాల నుంచి పార్సిల్స్‌లను పంపించనున్నట్లు చెప్పారు. కూటమి ఎమ్మెల్యేగా వంతం నానాజీ, ఎంపీగా ఉదయ శ్రీనివాస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించడమే కాకుండా టీడీపీ కూటమికి పట్టం కట్టిన ప్రజలు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ మాజీ ఎంపీపీ జి.శ్రీనివాసరావు, కాకరపల్లి చలపతిరావు, కొజు నెహ్రూ, దేవు వెంకన్న, కొల్లాబత్తుల అప్పారావు, వేటుకూరి నాగమణి, కంచుమర్తి లావణ్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులకు ఉత్తమ మార్కులు

కాకినాడ రూరల్, జూన్ 5: నీట్ 2024 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉత్తమ మార్కులు సాధించినట్లు ఆదిత్య కార్యదర్శి ఎస్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. వి.సృజన్ 720 మార్కులకు గానూ 715 మార్కులతో అఖిలభారత ఓపెన్ కేటగిరీలో 115వ ర్యాంకును సాధించారన్నారు. అదే విధంగా ఎస్‌హెచ్‌డీ శ్రావణ సత్యరవికిరణ్ 710 మార్కులతో 411వ ర్యాంకును, ఎం.విశ్వత్ 705 మార్కులతో 104వ ర్యాంకును, ఎం.నైమితరాణి 382వ ర్యాంకులను పొందినట్లు తెలిపారు. అంతే కాకుండా ఆర్ఎంఎస్ఎస్ రామగోపాల్ 695, కేఎస్‌బీ సుందరి 695, డి.ప్రతిక 690, ఐఎల్ఎస్ సత్యాషిణి 690 మార్కులు సాధించారన్నారు. 19 మంది విద్యార్థులు 650పైనా 36 మంది విద్యార్థులు, 600పైనా 72 మంది విద్యార్థులు, 550పైనా సాధించి ఒకే క్యాంపస్ నుంచి 100 మెడికల్ సీట్లతో విజయం సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను వారికి శిక్షణనిచ్చిన అధ్యాపక వర్గాన్ని ఆదిత్య ఛైర్మన్ ఎస్.శేషారెడ్డి, దీపక్‌రెడ్డి, లక్ష్మీరాజ్యం తదితరులు అభినందించారు.

పిడుగుపాటుకు మహిళ మృతి


దేవి(ఫైల్)

రౌతులపూడి, జూన్ 5: కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన ఏలూరి దేవి (30) పిడుగు పడి మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భర్త నారాయణతో కలిసి కట్టెల కోసం గ్రామ శివారు ఉన్న కొండ వద్దకు వెళ్లింది. కట్టెలు తెస్తున్న సమయంలో ఉరుములతో కూడిన వర్షం పడింది. వర్షం వస్తున్న సమయంలో దేవిపై పిడుగు పడడంతో మృతి చెందింది. దేవికి పాప, బాబు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



జీజీహెచ్ (కాకినాడ) జూన్ 5 పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యవంతమైన మానవ మనుగడ సాధ్యమని కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) వైస్ ప్రిన్సిపాల్ డా.ఏ.విష్ణువర్ధన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైస్ ప్రిన్సిపాళ్లు డా.విష్ణువర్ధన్, డా.దేవీమాధవి ఆధ్వర్యంలో బుధవారం ఆర్ఎంసీ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డా. విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఎక్కడికక్కడ చెట్ల నరికివేత ద్వారా కాలుష్యం అధికమై ఆ ప్రభావం మానవ మనుగడపై పడుతుందన్నారు. ముఖ్యంగా నిరూపయోగంగా మారి నిస్సారమవుతున్న నేలను ఆధునిక సాంకేతికత, నూతన మెలకువల ద్వారా ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి భూమిని సారవంతం చేసి సాధ్యమైనంత ఎక్కువ ఆక్సిజన్‌ను విడుదల చేసే మొక్కలను నాటడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం పర్యావరణానికి సంబంధించి ఉత్తమ పోస్టర్ ప్రజెంటేషన్ చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలో 30 మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అనాటమీ విభాగాధిపతి డా.శశి, కమ్యూనిటీ మెడిసన్ విభాగాధిపతి డా.సుజాత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.సౌమ్య పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న కారు

ఇద్దరికి గాయాలు




క్షతగాత్రులు

పిఠాపురం, జూన్ 5: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం విరవాడ శివారులోని కూడలి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని కోలంక గ్రామం నుంచి తల్లికుమారులు మోటార్‌సైకిల్‌పై పిఠాపురం వెళుతున్నారు. అదే సమయంలో పిఠాపురం నుంచి దివిలి వెళ్తున్న కారు వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తల్లీకొడుకులకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ కూడలి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరి విత్తనాలు పంపిణీ


రంగంపేటలో రైతులకు విత్తనాలు సరఫరా చేస్తున్న వెంకట నరసింహారావు

రంగంపేట/దివాన్‌చెరువు, జూన్ 5 : తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, ఎస్.హైమ జ్యోతిలు బుధవారం రంగంపేట మండలంలో గల అభ్యుదయ రైతులకు రంగంపేటలో నూతన వరి రకాలను పరిశోధన నిమిత్తం పంపిణీ చేశారని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన వరి రకాలైన ఎంటీయూ 1271, 1275, 1310, బీపీటీ, 2858, 2841 వంటి రకాలను ప్రస్తుత సార్వాలో రైతుల కమతాలలో పరీక్షచేసి వాటి గుణగణాలను పోలిన రకాలు, ఎప్పటి నుంచో రైతులు వాడుతున్న ఎంటీయూ 7029, బీపీటీ 5204 వంటి రకాలతో పోల్చి ఫలితాలను విశ్లేషించి, సిఫార్స్ చేస్తామన్నారు. అంతేకాక బీపీటీ 2841 వంటి నల్ల బియ్యం రకాలను, పోషక విలువలు కలిగిన రకాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రవేత్తలు చేస్తున్న కృషికి వ్యవసాయశాఖ అధికారులు, రైతులు వారిని అభినందించారు. అనంతరం శాస్త్రవేత్తలు నారుమడి యాజమాన్యం, విత్తనశుద్ధి గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి కె.శ్రీనివాస్, వి.మహేష్, రైతులు పోతుల పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో రాజధాని నిర్మాణం తథ్యం

అమలాపురం ఎంపీ విజేత గంటి హరీష్‌మాధుర్


మాట్లాడుతున్న అమలాపురం పార్లమెంట్ విజేత గంటి హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, జూన్ 5: అమరావతిలో రాజధాని నిర్మాణం పూర్తిచేసి తీరతామని అమలాపురం ఎంపీ విజేత గంటి హరీష్‌మాధుర్ స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు చరిత్రనే తిరగరాసిందన్నారు. ఇది ప్రజా విజయమన్నారు. నిజమైన అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకునే రాష్ట్ర ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి కూటమి అభ్యర్థులను గెలిపించుకున్నారన్నారు. ఎంపీగా ఎన్నికైన అనంతరం బుధవారం అమలాపురంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహం వద్ద తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, అరకొర సంక్షేమంతో పాటు జగన్ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. సంక్షేమం పేరుతో దోపిడీ పాలన సాగించిందన్నారు. 2014-19లో జరిగిన అభివృద్ధి మాత్రమే నేడు కనిపిస్తోందని, వైసీపీలో అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. ఎన్డీయేతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని గుర్తించి ప్రజలు ఓట్లు వేశారని, వారి నమ్మకాన్ని నిలబెడతామన్నారు. రాజధాని నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతానన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు తన పుట్టినరోజు నాడు టిక్కెట్టు ఇవ్వగా ఆయనకు రిటర్న్ గిఫ్ట్‌గా ఏడు నియోజకవర్గాల అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించి ఇస్తానన్న మాటను ప్రజలు నిలబెట్టారన్నారు. కోనసీమ రైల్వే లైన్ నిర్మాణాన్ని ఐదేళ్లలో పూర్తి చేయడంతో పాటు పారదర్శక పాలన సాగిస్తామన్నారు. నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ఓఎన్జీసీ, వేదాంత, గెయిల్ వంటి చమురు సంస్థలతో చర్చిస్తానన్నారు. లంక గ్రామాల ప్రజలు కనీసం మౌలిక వసతులు లేని పరిస్థితుల్లో ఉన్నారని, వారు నివసిస్తున్న ప్రాంతాల్లో రోడ్లు, వంతెనల నిర్మాణంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారిస్తామన్నారు. కోనసీమలో కోకోనట్ బోర్డు ఏర్పాటు, టూరిజం అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్నారు. ఎన్డీయేలో మంత్రి పదవి వచ్చే అవకాశం ఉందా అని విలేకరులు ప్రశ్నించగా టీడీపీ అధినేత తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని హరీష్‌మాధుర్ సమాధానమిచ్చారు. మెట్ల రమణబాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రైతులు, విద్యార్థులు, యువత, భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సైకో పరిపాలనకు రాష్ట్ర ప్రజలు సరైన తీర్పు ఇచ్చారన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్లు యాళ్ల నాగసతీష్, చిక్కాల గణేష్, నాయకులు నల్లా శ్రీధర్, యేడిద శ్రీను, బొర్రా ఈశ్వరరావు, ఆశెట్టి ఆదిబాబు, నల్లా స్వామి, తిక్కిరెడ్డి నేతాజీ, మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ, బాస్కర్ల రామకృష్ణ, వలవల శివరావు, గంధం శ్రీను పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొని వ్యక్తి మృతి



ఎటపాక,జూన్ 5: ప్రమాదవశాత్తు అదుపుతప్పి ద్విచక్ర వాహనం, ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై రాంగోపాలపురం గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జోర్నపాల్ సమీపంలోని పూసుగూడెం గ్రామానికి చెందిన మడివి భీమా(35) ఓ పని నిమిత్తం భద్రాచలం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో రాంగోపాలపురం వద్ద కుంట నుంచి విజయవాడ వైపు వెళ్తున్న భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుని ఎదురుగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భీమా తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు, రేపు ఆర్టీసీ బస్ పాసుల జారీ ఉండదు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 5 : రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలోని బస్ పాసుల జారీ కౌంటర్ సాఫ్ట్‌వేర్ నవీకరణ జరుగుతున్న కారణంగా ఈనెల 6, 7 తేదీల్లో (గురు, శుక్రవారాలు) బస్‌పాసుల జారీ ఉండదని డిపో మేనేజర్ షేక్ షబ్బాం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 8వ తేదీన కౌంటర్ యథావిధిగా పనిచేస్తుందని, విద్యార్థులు, మంత్లీ సీజన్ టిక్కెట్లు తీసుకునేవారు, ప్రత్యేక ప్రతిభావంతులు తదితరులంతా సహకరించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

11న మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం

రంగంపేట, జూన్ 5: ఈనెల 11న మధ్యాహ్నం 2 గంటలకు రంగంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో బి.శ్రీరామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు అందరూ పూర్తి సమాచారంతో తప్పక హాజరుకావాలని, సమావేశానికి హాజరుకాని వారిపై తగు చర్యలు నిమిత్తం వారి శాఖాధికారులకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు.

ఏజెన్సీ సమాచారం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వరరామచంద్రపురం, జూన్5: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని జడ్పీటీసీ వోళ్ల రంగారెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి మానవుడికి అవినాభావ సంబంధముందని మనుషులు ప్రశాంతంగా జీవించాలంటే పర్యావరణ పరిరక్షణ చాలా ముఖ్యమన్నారు. ప్రతీ ఒక్కరూ చెట్లు నాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇది చిన్నపిల్లలకు సైతం ఈవిషయం తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, సబ్‌డివిజన్ ఫారెస్టు ఆఫీసర్ కెవీవీఎస్ రామారావు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అటవీ సిబ్బంది



మొక్కలు నాటుతున్న సిబ్బంది

మోతుగూడెం, జూన్ 5:చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న ఇంతులూరు వాగు గ్రామం రోడ్డు పక్కన పర్యావరణ దినోత్సవం సందర్భంగా డీఎఫ్‌వో బబిత ఆదేశాల ప్రకారం సిబ్బంది మొక్కలు నాటారు. లక్కవరం రేంజర్ టి.నానాజీ ఆధ్వర్యంలో 100 వేప, నారా, నేరేడు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో సూర్యనారాయణ, బీట్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న కార్యకర్తలు

మోతుగూడెం, జూన్ 5: కూటమి అభ్యర్థి మిరియాల శిరీషాదేవి భారీ మెజార్టీతో ఘన విజయం సాధించడంతో ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గంలో అంగన్‌వాడీ టీచర్‌గా మొదలై అసెంబ్లీ వైపు అడుగులు వేస్తూ రంపచోడవరం నియోజకవర్గంలో వైసీపీ కంచుకోటలని బద్దలకొట్టి 15 ఏళ్ల తర్వాత మిరియాల శిరీషాదేవి టీడీపీకి విజయం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు పాసి రమణ, ఓలయ్య, అంగ శ్రీను, జనసేన నాయకులు, భీమరాజు, సాయి ప్రసాద్, టీడీపీ మహిళా కార్యకర్తలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే విజేతకు అభినందనలు



శిరీషాదేవిని అభినందిస్తున్న నాయకులు

రాజవొమ్మంగి జూన్ 5: ఎమ్మెల్యేగా విజయం సాధించి మంగళవారం రాత్రి రాజవొమ్మంగి మండలంలోని అనంతగిరి(స్వగ్రామం) గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి గ్రామస్థులు బ్రహ్మరథం పట్టారు. జడ్పీటీసీ వడుగుల జ్యోతి తదితర నాయకులు ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించారు. బుధవారం ఉదయం అనంతగిరి గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. చాలా మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో అనంతగిరి గ్రామం చేరుకుని ఎమ్మెల్యే శిరీషాదేవికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలందరికి రుణపడి ఉంటానని, ఇది ప్రజల విజయమని, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కూటమి నాయకుల వేడుకలు



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

దేవీపట్నం, జూన్5: రాష్ట్రంలో కూటమి విజయం సాధించడంతో మండలంలోని ఇందుకూరుపేటలో కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. రంపచోడవరం ఎమ్మెల్యేగా మిరియాల శిరీషాదేవి విజయం పట్ల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మర్రిచెట్ల వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఎ.నగేష్, గోళ్ల చంటి, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, తెలుగు యువత అధ్యక్షుడు లంక హరిశ్చంద్రుడు, జనసేన నాయకులు అంజిబాబు, చారపు వెంకటరాయుడు, వాసు, నాని, కాపు, వీరబాబు పాల్గొన్నారు.

కంబాలకు సత్కారం

సార్వత్రిక ఎన్నికల్లో రంపచోడవరం నియోజకవర్గం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసిన మిరియాల శిరీషాదేవి గెలుపునకు కృషిచేసిన విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావును బుధవారం టీడీపీ నాయకులు సత్కరించారు. గోకవరం గ్రామంలో తంటికొండ రోడ్‌లో ఉన్న లేఅవుట్ కార్యాలయం వద్ద ఘనంగా సన్మానించారు.

మలేరియాను అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయం

సీతానగరం, జూన్ 5: మలేరియాను అశ్రద్ధ చేస్తే అది క్రమంగా మెదడుకి సోకి ప్రాణాపాయం సంభవిస్తుందని పీహెచ్‌సీ వైద్యులు చైతన్య తెలిపారు. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డా.చైతన్య ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనాఫిలీస్ అనే ఆడదోమ కుట్టడం వలన మలేరియా వస్తుందన్నారు. ఈ దోమల వృద్ధికి కారణమయ్యే ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. పాత టైర్లు, కొబ్బరి డొక్కలు, చిప్పలు, రోళ్లు ఇతర ప్లాస్టిక్ డబ్బాలు, నీటి కుండీలలో నీరు మూడు రోజులకు మించి నిల్వ లేకుండా చూడాలన్నారు. కొద్దిపాటి జ్వరం వచ్చినా వెంటనే ఆశావర్కర్లను సంప్రదించి గ్రామంలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు వాడాలన్నారు. ఎంపీహెచ్ఈఓ వై.సుబ్బారాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి, కె సుధాకర్, జి.దేవకృప, రేవతి, స్వరూపారాణి, నందీశ్వరరావు, సౌజన్య, జి స్వరూప తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ పురందేశ్వరిని సత్కరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల , సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆళ్ల గోవింద్ తదితరులు



గోకవరంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

అత్యధిక మెజార్టీతో చరిత్ర సృష్టించాం

- ఇది ప్రజావిజయం మా నేతలకు అంకితం
- నగర అభివృద్ధికి కార్యాచరణ చేపట్టాం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5: రాజమహేంద్రవరంలో 71వేల పైచీలుక మెజార్టీతో సరికొత్త చరిత్రను సృష్టించామని నూతన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం స్థానిక తిలక్‌రోడ్డులోని పార్టీ ఎన్నికల కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషితో తాను ఇంత ఘనవిజయాన్ని అందుకున్నానని అన్నారు. అందుకు కారకులైన వారికి, నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆది నుంచి తనపై తప్పుడుగా ట్రోల్ చేసిన వైసీపీ పేటీఎం వారికి చెబుతున్నా, ఎమి చేసుకుంటారో చేసుకోండని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు కొట్టిన దెబ్బకు గూబగుయ్యామందన్నారు. తాను సాధించింది ప్రజా విజయమన్నారు. ఈ విజయాన్ని కూటమీ నేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోదీలకు అంకితమిస్తున్నానని చెప్పారు. గత ఐదేళ్లలో వైసీపీ నేతలు తమను ఇబ్బందులు పెట్టారని తన భార్యను అసెంబ్లీలో చాలా అవమానించారని గుర్తుచేశారు. రెండునెలల కంటిమీద నిద్ర లేకుండా చేశారని చివరికి తమను ప్రలోభాలకు గురిచేయాలని చేసిన ప్రయత్నాలు ఫలించక అక్రమ కేసులో తనను, తన తండ్రి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావును జైలులో పెట్టారని గుర్తుచేశారు. వైసీపీ చాలా చిల్లర రాజకీయాలు చేసిందన్నారు. మేము ధృడసంకల్పంతో ఉన్నామని ప్రాణాలు ఉన్నంతవరకు టీడీపీలోనే ఉంటామన్నారు. రాజమహేంద్రవరం ప్రజలకు ఎదైతే హామీలు ఇచ్చామో, నగర అభివృద్ధికి లోకల్ మేనిఫెస్టో తయారు చేశామో వాటిని నెరవేరుస్తామన్నారు. తాను గెలిచిన వెంటనే కార్యాచరణ కూడా సిద్ధం చేసి పనులు మొదలు పెట్టానని చెప్పారు. నగర అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళిక తన వద్ద ఉందన్నారు. ఈ సమావేశంలో జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ నగర ఇన్‌చార్జి యెనుముల రంగబాబు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, నాయకులు మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, మాజీ కార్పొరేటర్లు కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, బుడ్డిగ రవి, మురుకుర్తి రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పురందేశ్వరిని కలిసిన ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5: రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని రూరల్, సిటీ ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్‌లు మర్యాపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో ఆమెను సత్కరించారు. వారిని కూడా పురందేశ్వరి ప్రత్యేకంగా అభినందించారు. వారితో పాటు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన కూటమి నాయకులు పురందేశ్వరి కలిసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

● రాజమహేంద్రవరం ఎంపి , సిటీ, రూరల్ నియోజకవర్గాల నుంచి కూటమి ఎమ్మెల్యేలుగా భారీ మెజార్టీతో విజయం సాధించిన దగ్గుబాటి పురందేశ్వరి, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్‌లను కలిసేందుకు నాయకులు , పలువురు అధికారులు, కార్యకర్తలు అభిమానులు కార్యాలయాలకు తరలివస్తున్నారు. ప్రత్యేకంగా అభినందలు తెలుపుతున్నారు. పలు శాఖలకు చెందిన అధికారులు కూడా ఎమ్మెల్యేలను కలిసి అభినందనలు తెలుపుతున్నారు. దీంతో అటు గోరంట్ల నివాసం వద్ద, ఇటు ఆదిరెడ్డి నివాసం వద్ద , ఎంపి నివాసం వద్ద భారీగా కార్లు, బైక్‌లలతో రహదార్లు జామ్‌అవుతున్నాయి.

మొక్కులు తీర్చుకున్న తెలుగు మహిళలు



మొక్కులు తీర్చుకుంటున్న తెలుగు మహిళలు

కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు అత్యధిక మెజార్టీ రావాలని చంద్రబాబు సీఎం కావాలని మొక్కుకున్న తెలుగు మహిళలు వాటిని తీర్చుకున్నారు. తెలుగు మహిళా అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి ఆధ్వర్యంలో తోట వీధిలో గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. 108 మంది ముత్తైదువులు 108 బిందెలతో గణపతికి జలాభిషేకం చేశారు. . కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకులు తురకల నిర్మల, మీసాల నాగమణి, అంగన్‌వాడీ కమిటీ అధ్యక్షురాలు బోను ఈశ్వరీ, ఆదిలక్ష్మి, కోన సత్య నాగలక్ష్మి, చంద్రకళ, కృష్ణవేణి, నాగలక్ష్మి, వీరవేణి, సూర్యకుమారి, జయ, భాను, సత్య, ఈశ్వరి, మహాలక్ష్మి డివిజన్ గౌరవ అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, కార్యదర్శి వీరా రాము, రొక్కం మల్లేష్, పేరిశెట్టి సత్తిబాబు, కరాటి బాలా తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి మొక్కను అందజేస్తున్న నర్సరీసంఘం, ఎమ్మెల్యే గోరింట్లను సత్కరిస్తున్న జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు

3వ డివిజన్‌లో ఇంటింట స్వీట్లు పంచిన కుడుపూడి

ఆదిరెడ్డి శ్రీనివాస్ ను సిటీ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీలో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ స్థానిక 3వ డివిజన్‌లో టీడీపీ శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు ఇంటింకి స్వీట్లు పంచారు. డివిజన్‌లో విజయోత్సవ సంబరాలు చేశారు. 100 కేజీలు స్వీట్లు పంచారు. చంద్రబాబు సీఎం కావడంతో రాష్ట్రం బాగుపడుతుందన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన జనసేన నేత అనుశ్రీ

జిల్లాలో నూతనంగా ఎన్నికైన కూటమి ఎంపీ, ఎమ్మెల్యేలను రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ జనసేన ఇంచార్జీ అనుశ్రీ సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణుడులను కలిసి వారిని సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. అనుశ్రీ సత్యనారాయణకు ఆయన కార్యవర్గానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట జనసేన ఉపాధ్యక్షుడు గుత్తుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నల్లంశెట్టి వీబాబు, సిటీ కార్యదర్శులు గుణ్ణం శ్యామ్‌సుందర్, అల్లాటి రాజు, విన్నా వాసు, సంయుక్త కార్యదర్శి వట్టికుటి వేణుగోపాల్ కృష్ణ ,ఇంద్ర విజయ్ తదితరులు ఉన్నారు.

విజేతలకు అభినందనలు

కడియం, జూన్ 5: రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థినిగా ఘన విజయం సాధించిన దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన గోరంట్ల బుచ్చయ్యచౌదరిలను నర్సరీ సంఘం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, ఉపాధ్యక్షుడు పెనుమాక కొండబాబు, సెక్రటరీ గాద నాగేశ్వరరావు, ట్రెజరర్ తాడాల బాలమురళి, పీఆర్‌వో గరగ నాగేశ్వరరావు, డైరెక్టర్లు గాజుల రత్తయ్య, తాడాల నాగేశ్వరరావు, కొండేపూడి నాగు, కోఆప్షన్ మెంబర్ రాజేష్ ఉన్నారు.

●గోరంట్ల బుచ్చయ్యచౌదరిని టీడీపీ-జనసేన నాయకులు కలిసి భారీ గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడియపులంక మాజీ సర్పంచ్ గట్టి నర్సయ్య, వేమగిరి మాజీ సర్పంచ్ డా. వెలుగుబంటి వెంకటాచలం(నాని), వైస్ ఎంపీపీ పంతం గణపతి, నర్సరీరైతులు గట్టి సుబ్బారావు, మల్లు శివన్నారాయణ తదితరులు ఉన్నారు.

ఎంపీ పురందేశ్వరిని కలిసిన జనసేన నాయకులు

దివాన్‌చెరువు, జూన్ 5: బీజేపీ, టీడీపీ జనసేన కూటమి రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని రాజానగరం మండల జనసేన నాయకులు పేపకాయల విష్ణుమూర్తి, దేశాలశ్రీను, ద్వారంపూడి నాగమునేశ్వరరావు, ఎంపీ కృష్ణప్రసాద్ మర్యాదపూర్వకంగా బుధవారం కలసి శుభాకాంక్షలు తెలిపారు

నల్లమిల్లి నివాసానికి పోటెత్తిన అభిమానులు

అనపర్తి, జూన్ 5 : అనపర్తి ఎమ్మెల్యేగా రెండవ సారి విజయం సాధించిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపేందుకు బుధవారం ఆయన అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, వివిధ శాఖల అధికారులు పోటెత్తారు. అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, డ్వాక్రా యానిమేటర్లు తరలివచ్చి నల్లమిల్లిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రామకృష్ణారెడ్డిని అభినందించిన టీడీపీ నేతలు

బిక్కవోలు, జూన్ 5: కూటమి అభ్యర్థిగా ఎన్నికైన నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని బుధవారం బిక్కవోలుకు చెందిన దేశం నేతలు కలసి అభినందించారు. అభినందించిన వారిలో మండల మాజీ అధ్యక్షుడు పల్లి వాసు, గ్రామశాఖ అధ్యక్షుడు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, రాయుడు రామచంద్రరావు, సింగారపు రామారావు వున్నారు.

రంగంపేట, జూన్ 5: అనపర్తి ఎమ్మెల్యేగా విజయదుందుభీ మోగించిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద్, ఆళ్ళ బాబి, ఆళ్ళ రామకృష్ణ, రంగంపేట మండల నాయకులు వెలుగుబంటి టి.సత్తిబాబు, నీలపాల త్రిమూర్తులు, ఉద్దం ద్రావు శ్రీను, మాచిన వెంకన్నదొర, నిమ్మలపూడి కాటన్‌దొర, మోదుకూరి గోపాలకృష్ణ, ఇతర నాయకులు, మండల విద్యాశాఖాధికాలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూధనరావు, జేఈ కె.శ్రీనివాసరావు, ఆయా శాఖాధికారులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దుస్సాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు.

కూటమి నాయకులు సంబరాలు

గోకవరం, జూన్5: జగ్గంపేట కూటమి అభ్యర్థిగా జ్యోతుల నెహ్రూ, కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థిగా తంగెళ్ళ ఉదయశ్రీనివాస్ విజయానికి సహకరించిన ప్రతీఒక్కరికీ గోకవరం కూటమి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. గోకవరంలోని టీడీపీ సీనియర్ నాయకుడు బత్తుల సత్తిబాబు స్వగృహంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేసంలో కూటమి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అసెంబ్లీకి 164 సీట్లు, పార్లమెంట్‌కు 21 సీట్లు కూటమి అభ్యర్థులను గెలిపించిన ప్రజానీకానికి పాదాభివంద నాలన్నారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేయడంతోపాటు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు మంగరౌతు రాము, పాలూరి బోస్, బత్తుల సత్తిబాబు, దాసరి తమ్మన్నదొర, గాజింగం సత్తిబాబు, మట్టా మంగరాజు, పదిలం మురళి, ప్రగడ ప్రభ, మండిగ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆ రెండు గ్రామాలు చరిత్రను తిరగరాశాయి

గోకవరం, జూన్ 5: ఎన్నికల ఫలితాల్లో జగ్గంపేట నియోజకవర్గంలోని గోకవరం మండలంలో రెండు గ్రామాల్లో ఎన్నికల ఫలితాలు చరిత్రను తిరగరాశాయి టీడీపీ ఆవిర్భావం నుంచి ఏ ఎన్నికల్లోనూ ఎపుడూ ఆపార్టీకి మెజార్టీ రాని ఆ రెండు గ్రామాల్లో ఈసారి జరిగిన ఎన్నికల్లో మెజార్టీని కైవసం చేసుకున్నాయి. అచ్యుతాపురం, గాదెలపాలెం గ్రామాల్లో ఈవిశేషం చోటు చేసుకోవడం విశేషం. అచ్యుతాపురంలో తమ సమీప ప్రత్యర్థి పార్టీ వైసీపీపై 212 ఓట్లు టీడీపీ మెజార్టీ సాధించగా, గాదెల పాలెంలో టీడీపీకి 87 ఓట్లు ఆధిక్యంగా వచ్చాయి. అలాగే గోకవరం మండలంలో ఉన్న ప్రతీ గ్రామం టీడీపీయే పైచేయి సాధించింది.

సీతానగరం, జూన్ 5: రాజానగరం నియోజక వర్గంలో కూటమి అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందడంతో కూటమి నాయకులు ,కార్యకర్తలు సంబరాలలో మునిగి తేలారు. మండలంలోని పురుషోత్తపట్నం, రామచంద్రపురం గ్రామాలలో భోజనాలు ఏర్పాటు చేసి సంబరాలు జరుపుకున్నారు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పీడీజే
గంధం సునీత



పుష్కరాలరేవులో నాచును తొలగిస్తున్న టీకే, రౌతు

రాజమహేంద్రవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావ రణ పరిరక్షణ అందరి బాధ్యతని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలన్నారు. పర్యావరణానికి హాని కలిగిస్తే భవిష్యత్తు తరాల మను గడ ప్రమాదంలో పడుతుందన్నారు. కార్యక్రమంలో శాశ్వ త లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.గాయత్రి దేవి, ప్రిన్సిపల్ అండ్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ, ఎంసీపీసీ సీనియర్ ట్రైనర్స్ వినయ్‌కుమార్ గుప్తా, సునీల్ కుమార్ అగర్వాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.వీరేంద్రనాథ్, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న పీఈజే గంధం సునీత

గోదావరి కలుషిత నియంత్రణ అందరి భాధ్యత

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5: రాజమహేంద్రవరం కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీ కే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సమితి ఆధ్యంలో గోదావరి పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా నావలో గోదావరి పైకి వెళ్లి నదిలో ఉన్న చెత్త, చెదారాలు, నాచును తొలగించారు. నది కలుషితం కాకుండా ఉండాలనే ఆలోచనతో తాము పనిచేస్తున్నామని విశ్వేశ్వరరెడ్డి అన్నారు. రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావుతో కలిసి నదిలో నాచును తొలగించారు. సమితి సభ్యులు చుండ్రు వీరభద్రరావు, ఎన్.అప్పారావు, ఎస్‌వీవీ రెడ్డి, బి. అప్పారావు, సురేష్, శ్రీను పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలి

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 5: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని అంత ర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు గొట్టిముక్కల అనంతరావు పిలుపు నిచ్చారు. బుధవారం రాజమహేంద్రవరం టి.నగర్‌లోని రెడ్ క్రాస్ కార్యాలయంలో మాట్లాడుతూ, పర్యావరణను రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గొట్టి ముక్కల అనంతరావు రెడ్‌క్రాస్ భవనం ప్రాంగణంలో అనేకరకాల మొక్కలు నాటారు. రెడ్ క్రాస్ సొసైటీ ఎంసీ మెంబరు జిన్నిబి మహలక్ష్మి, రాజమండ్రి బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ధర్నాలకోట వెంకటేశ్వరరావు, రెడ్‌క్రాస్ లైఫ్ మెంబర్ సుధాకర్, సిబ్బంది పద్మ,పాల్గొన్నారు.

కాలుష్య రహిత వాహనాలను వినియోగించాలి

రాజానగరం, జూన్ 4 : కాలుష్య నివారణలో భాగంగా సాంప్రదాయ వనరుల నుంచి విద్యుత్, సౌరశక్తితో నడిచే వాహనాలను వినియోగించాలని అనపర్తి అగ్నిమాపక కార్యాలయం అధికారి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని చక్రద్వారబంధంలో గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గ్రామంలోని పలు ప్రాంతాల్లో బుధవారం వివిధ రకాలు మొక్కలు నాటారు. విరాట్ ఆర్గానిక్ ఫాం నిర్వాహకుడు రెడ్డి నాయుడు జీవామృత తయారీ విధానం, ఉపయోగాలు గురించి వివరించారు. కళాశాల పీవో షేక్ మీరా, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఆర్వో కె.మాధవీలత నుంచి డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న రాజమహేంద్రవరం పార్లమెంట్ విజేత దగ్గుబాటి పురందేశ్వరి, చిత్రంలో పెనుమర్తి శ్రీనివాస్ చీఫ్ఎలక్షన్ ఏజెంట్, కాశీవిశ్వనాథరాజు, స్టేట్ జనరల్ సెక్రటరీ, నామాని రాజశేఖర్, పెల్లూరి రమేష్, తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 5: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక వెంకటేశ్వర నగర్ లోని జవహర్ వాకర్స్ క్లబ్ మెంబర్లు పర్యావరణ పరిరక్షణకు విశేషంగా కృషి చేస్తున్న డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావుకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన డాక్టర్ కర్రి రామారెడ్డి, డాక్టర్ గోలి రామారావు, ఎఫ్ఎస్ఎస్ పట్నాయక్ మాట్లాడారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

బిక్కవోలు, జూన్ 5: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పందలపాక ప్లస్ టూ ఉన్నత పాఠశాల హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి పిలుపు నిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కోనాల సత్తిరాజు ప్రారంభించారు. ర్యాలీలో విద్యార్థులతో పాటు పీడీ ద్వారంపూడి యువరాజారెడ్డి, ఉపాధ్యాయులు కెవి. కృష్ణారెడ్డి, వీరెడ్డి, ఆదినారాయణ, నాగదేవి తదితరులు పాల్గొన్నారు.




సెంట్రల్ జైలులోకి వెళుతూ.. తర్వాత బయటకు వస్తూ.. (ఫైల్ ఫొటోస్)


రికార్డుల మోత!

- ఎన్నికల ఫలితాల్లో 'మెజార్టీ' రికార్డులు
- గత ఎన్నికల్లో ఎప్పుడూ రానంతగా నమోదు
- ఉమ్మడి 'తూర్పు'లో ఏడు నియోజకవర్గాల్లో 50వేలకుపైనే దాటేసిన ఆధిక్యతలు
- కాకినాడ రూరల్‌లో అత్యధికంగా పంతం నానాజీకి 72వేలపైనే మెజార్టీ
- ఆ తర్వాత రాజమహేంద్రవరం సిటీ 71వేలు, పిఠాపురంలో 70వేలపైమాటే
- రాజమహేంద్రవరం రూరల్, కాకినాడ సిటీ, కొత్తపేట, జగ్గంపేటల్లోనూ రికార్డుల మోతే
- ఈ నియోజకవర్గాల్లో ఐదేళ్లలో శృతిమించిపోయిన వైసీపీ అరాచకాలు, అక్రమాలు
- అధికారం అండతో యథేచ్ఛగా దోపిడీ, దౌర్జన్యాలు, బూతుల దండయాత్రలు
- చంద్రబాబును జైలుపాలు చేయడంతో వైసీపీని ఈడ్చికొట్టిన రాజమహేంద్రవరం ప్రజలు
- కాకినాడ సిటీ, కొత్తపేటల్లో అవినీతికి వైసీపీ ఎమ్మెల్యేలపై జనంలో తీవ్ర తిరుగుబాటు
- సీఎం జగన్ సామాజికవర్గం సాకుతో ఐదేళ్లుగా వీరిద్దరి అరాచకాలపై జనాగ్రహం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ప్రజలు టీడీపీ కూటమికి ఓట్ల వరద సృష్టించారు. అవినీతి, అక్రమాలతో నిండా మునిగిపోయి ప్రజల స్వేచ్ఛను హరించేసిన వైసీపీని ఉతికి ఆరేశారు. ఈవీఎంలపై కసిగా నొక్కి ఫ్యాన్‌ను భూస్థాపితం చేశారు. దీంతో టీడీపీ, జనసేన నుంచి పోటీచేసిన అభ్యర్థులు కనివినీ ఎరుగని మెజార్టీలతో నియోజకవర్గాల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రజలు ఇచ్చిన ఏకపక్ష తీర్పుతో ఇది వరకు ఎమ్మెల్యేలుగా నెగ్గిన అభ్యర్థుల గత రికార్డులు సైతం తుడిచిపెట్టుకుపోయాయి. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో కూటమి అభ్యర్థులంతా వేలాది ఓట్ల మెజార్టీలతో గెలుపొందారు. కానీ వీటిలో ఉమ్మడి జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో మాత్రం ఓటర్లు వైసీపీపై ఒకరకమైన కసి, కోపంతో కూటమికి ఓట్ల వరద పారించారు. మిగిలిన నియోజకవర్గాలతో పోల్చితే అంతుచిక్కనంత అనూహ్య మెజార్టీలు కట్టబెట్టారు. అంతా కూడబలుక్కునట్టు ఉప్పెనలా కదిలి ఓట్లేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కాకినాడ రూరల్, రాజమహేంద్రవరం సిటీ, పిఠాపురం, రాజమహేంద్రవరం రూరల్, కాకినాడ సిటీ, కొత్తపేట, జగ్గంపేట నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులు ఏకంగా 50 వేల నుంచి 72వేలకుపైగా మెజార్టీలు దక్కించుకున్నారు. ఒకరకంగా చెప్పాలంటే గత ఏ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ నియోజకవర్గాల నుంచి నెగ్గిన ఎమ్మెల్యేలకు ఈ స్థాయి మెజార్టీలు రాలేదు. కానీ ఇప్పుడు ఏ నియోజకవర్గాల్లోనూ లేనివిధంగా ఇక్కడే సరికొత్త రికార్డు ఆధిక్యతలు రావడానికి కారణాలేమిటనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.


పంతం నానాజీ (జనసేన)
మెజారిటీ : 72,040


ఆదిరెడ్డి శ్రీనివాస్ (టీడీపీ)
మెజారిటీ : 71,404


పవన్‌కల్యాణ్ (జనసేన)
మెజారిటీ : 70,279


బుచ్చయ్యచౌదరి (టీడీపీ)
మెజారిటీ : 64,090


వనమాడి కొండబాబు (టీడీపీ)
మెజారిటీ : 56,573


బండారు సత్యానందరావు (టీడీపీ)
మెజారిటీ : 56,479


జ్యోతుల నెహ్రూ (టీడీపీ)
మెజారిటీ : 52,676

(కాకినాడ/రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో అధికార వైసీపీ నేతలు ఈ అయిదేళ్లలో అధికారం అడ్డుపెట్టుకుని సాగించిన దురాగతాలు, బెదిరింపులే ఈ స్థాయిలో ప్రజలు స్పందించడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఆ కోపమే కూటమి అభ్యర్థులకు ఓట్ల వర్షం కురిపించిందనే చర్చ జరుగుతోంది. కాకినాడ రూరల్‌లో మాజీ మంత్రి కన్నబాబు అధికారం అండతో అవినీతితో రెచ్చిపోయారు. కుటుంబం మొత్తం నియోజకవర్గాన్ని జుర్రేశారు. దీంతో ఇక్కడ అవినీతిపై ప్రజలకు విసుగొచ్చేసింది. ప్రతి పనికి రేటు నిర్ణయించేసి సదరు నేత కోట్లకు పడగలెత్తారు. అలాగే ఇక్కడ ఎన్నికల ప్రచారం చేసిన పవన్ ఎమ్మెల్యే కన్నబాబు అవినీతిపై విరుచుకుపడ్డారు. ఒకప్పుడు డొక్కు సైకిల్‌పై తిరిగిన కన్నబాబు, ఇప్పుడు వెయ్యి కోట్లు సంపాదించారని ఆధారాలతో ఆరోపించారు. ఇక్కడ జనసేన అభ్యర్థి పంతం నానాజీకి ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా ఏకంగా 72వేలకుపైగా మెజార్టీ వచ్చేలా చేసింది. అటు రాజమహేంద్రవరం సిటీలో ఆదిరెడ్డి వాసు టీడీపీ నుంచి 71 వేలకుపైగా మెజార్టీతో నెగ్గారు. నిజానికి రాజమండ్రి సిటీలో, రూరల్‌లోనూ పోలింగ్ శాతం తక్కువ నమోదైంది. అయినాగానీ ఇక్కడ భారీ మెజార్టీలు వచ్చాయి. పోలింగ్ శాతం పెరిగితే ఇంకెంత మెజార్టీ వచ్చేదో మరి. ఇదో కొత్త చరిత్ర. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే టీడీపీ నుంచి ఆదిరెడ్డి భవానీ ఉన్నారు. కానీ అధికారంలో ఉన్నది వైసీపీ కావడంతో ఆ పార్టీ ఎంపీ భరత్ తన వ్యవహార శైలితో రాజమహేంద్రవరం ప్రజల్లో వైసీపీపై ఒకరకమైన ఏహ్యభావం కలిగించేలా చేశారు. అవినీతి ఆరోపణలు, రెచ్చగొట్టే బూతులు, సాధ్యంకాని హామీలతో నవ్వులపాలయ్యారు. అలాగే ఆదిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని జగన్ ప్రభుత్వం అరెస్టులు చేయడం, వారి వ్యాపారాలపై దెబ్బకొట్టడం ప్రజల్లో ఆదిరెడ్డి కుటుంబంపై సానుభూతి పెంచింది. అన్నింటికీ మించి స్కిల్ కేసులో అక్రమంగా అరెస్టైన చంద్రబాబును నెలల తరబడి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉంచడంతో ఇక్కడి ప్రజలు వైసీపీ అరాచకాలను నేరుగా చూశారు. దీంతో ఎన్నికల్లో ఓటుతో వైసీపీని కసితీరా చితక్కొట్టారు. రాజమండ్రి రూరల్ నుంచి కూటమి తరపున టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి ఆయనకు ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి మంత్రి వేణుకంటే 64,090 ఓట్లు మెజార్టీ లభించింది. 11సార్లు ఎన్నికల్లో పోటీచేసిన గోరంట్ల 7వసారి అసెంబ్లీకి ఎన్నికై మరో రికార్డు సృష్టించారు. పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌ను ఓడించడానికి వైసీపీ పన్నని కుట్రలు, కుతంత్రాలంటూ లేవు. కడప నుంచి బృందాలు రావడం, కోట్లు కుమ్మరించడం ఇవన్నీ ప్రజల్లో వైసీపీపై అసహ్యాన్ని పెంచాయి. ఎన్నికల చివరి రోజు జగన్ సభ, ఎమ్మెల్యే అభ్యర్థి గీత ఏడుపు నటనలు జనంలో వైసీపీపై నిలువెత్తు కోపం పెంచాయి. ఇదంతా పవన్‌పై అక్కసుతోనే అని గ్రహించారు. రాజమహేంద్రవరం రూరల్‌లో టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేగా బుచ్చయ్యచౌదరి ఉన్నారు. కానీ ఇక్కడకు వైసీపీ అభ్యర్థిగా అవినీతిలో మునిగిపోయిన మంత్రి వేణు రామచంద్రపురం నుంచి బదిలీపై రావడం మైనస్‌గా మారిపోయింది. పైగా ఇక్కడ వైసీపీ సాగించని అవినీతింటూ లేకుండా పోయింది.

పార్లమెంటు అభ్యర్థులకూ భారీ మెజారిటీలు

ఇక పార్లమెంట్ కూటమి అభ్యర్థిగా గెలిచిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎన్టీఆర్ కూతురు దగ్గుబాటి పురందేశ్వరికి 2,39,139 ఓట్ల మెజార్టీ లభించింది. జిల్లాలో గతంలో ఎన్నడూ ఎవరికీ ఇంత మెజార్టీ లభించలేదు. గతంలో టీడీపీ ఎంపీగా గెలిచిన మాగంటి మురళీమోహన్ లక్షా 60వేల ఓట్లు సాధించి రికార్డు సాధించగా, పురందేశ్వరి ఆ రికార్డును కూడా బ్రేక్ చేశారు. అలాగే అమలాపురం పార్లమెంటు టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన గంటి హరీష్‌మాధుర్ (బాలయోగి)కి 3,42,196 ఓట్ల మెజారిటీ లభించింది. ఇది కూడా ఒక చరిత్రే. కాకినాడ పార్లమెంటు జనసేన కూటమి అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించిన తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు 2,29,491 ఓట్ల మెజారిటీ లభించింది. మొత్తానికి కాకినాడ, అమలాపురం, రాజమండ్రి పార్లమెంటు స్థానాల నుంచి మెజారిటీల విషయంలో భారీగా రికార్డుల మోత మోగించారు.

వారిద్దరి అరాచకం అంతా ఇంతా కాదు...

కాకినాడ సిటీ, కొత్తపేటల్లో వైసీపీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి, జగ్గిరెడ్డి ఇద్దరూ అవినీతికి నిలువెత్తు రూపాలుగా మారారు. ఈ అయిదేళ్లలో నియోజకవర్గాలను వీరిద్దరు పీల్చి పిప్పిచేసినంతగా మరెవరూ చేయలేదు. ఇసుక, మట్టి గ్రావెల్ దోపిడీలు, సెటిల్‌మెంట్లు, దందాలు, రౌడీయిజం, ప్రశ్నించే వారిపై కేసులు, దాడులతో ద్వారంపూడి, జగ్గిరెడ్డి చెలరేగిపోయారు. వీరిద్దరిదీ సీఎం సామాజికవర్గం కావడంతో తమకు ఎదురేలేదన్నట్టు వ్యవహరించారు. అయిదేళ్లలో వందల కోట్లు సంపాదించారు. ప్రజలకు ఏ చిన్నమేలు చేయకపోవడం ఒకెత్తయితే ప్రతి పనికి రేటుతో చెలరేగిపోయారు. వీటన్నింటితో విసుగెత్తిపోయిన ప్రజలు ఓటుతో చాచికొట్టారు. నియంతల్లా వ్యవహరిస్తున్న వీరిద్దరినీ ఓటుతో కసిదీరా కొట్టి టీడీపీ అభ్యర్థులకు అఖండ ఓట్ల మెజార్టీ కురిపించి తమ కోపం చల్లార్చుకున్నారు. జగ్గంపేటలో సైతం సిట్టింగ్ ఎమ్మెల్యే చంటిబాబు అవినీతికి హద్దుల్లేకుండా పోయింది. దీంతో ఇక్కడ కూడా ఆ పార్టీని నామరూపాల్లేకుండా జనం చీల్చిచెండాడేశారు. అదే రీతిన కురసాల కన్నబాబుకు గట్టి షాక్ ఇచ్చారు.



ఆ పాపమే పెను శాపమై..

- సెంట్రల్ జైలులో చంద్రబాబు
- అక్రమంగా 53 రోజులు బంధించిన జగన్
- ఆ క్షణం నుంచే ఓటరులో మౌన వేదన
- సమయం చూసి ఓట్లతో కొట్టారు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జగన్ చేసిన ఆ పాపాలే వైసీపీ పాలిట పెను శాపాలై వెంటాడి వేటాడాయి. ఆ పాపాలకు గత ఏడాది సెప్టెంబరు 10 పరాకాష్ఠ. రాష్ట్రానికి చీకటి రోజు. రాజకీయ కక్షతో రగిలిపోయిన జగన్.. చంద్రబాబును అక్రమ కేసులో ఇరికించి రాజమండ్రి సెంట్రల్ జైలులోని స్నేహ బ్లాక్‌లో బంధించిన రోజు. ఆనాటి ప్రజల కన్నీరే ఓటు రూపంలో వైసీపీపై వేటు వేసింది. ప్రజాతీర్పులో వంచకులు కొట్టుకుపోక తప్పలేదు. చంద్రబాబును సీబీసీఐడీ అరెస్టు చేసిన క్షణం నుంచీ జనం కళ్లల్లో ఉబికివచ్చిన కన్నీరు ఇంకిపోయి కసిగా మారింది. చంద్రబాబు వయసు, రాజకీయ ప్రయాణం, సుదీర్ఘ అనుభవం, సంపదను సృష్టించే సామర్థ్యం.. ఏదీ వైసీపీ వారి కళ్లకు కనిపించలేదు. ఒకే లక్ష్యం.. చంద్రబాబును జైలుకు పంపడం. పైశాచిక ఆనందాన్ని పొందడం. అయితే, కాలం ఊరుకున్నా ఓటరు ఊరుకుంటాడా. సరిగ్గా 8 నెలల 2 రోజులు పంటి బిగువున అదిమి పట్టుకున్న అభిమానం అగ్నిపర్వతమై జగన్నాటకాన్ని దహించేసింది. చంద్రబాబు జైలులో ఉన్న రోజులు నిజంగా ఓ చరిత్ర. ఆయన భద్రతపై జనం ఎంత భయపడుతున్నా ఆ 'లీడర్' మాత్రం నిండుకుండలా ఒక్క క్షణం కూడా తొణికిసలాడలేదు. పైగా జైలు నుంచే ప్రజలకు ధైర్యం చెప్పారు. కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. ఖైదీలు సైతం ఆయనతో మాట్లాడడానికి ఎంతో ప్రయత్నించారు. తమ గోడు వెళ్లబోసుకోవడానికి చూశారు. కానీ అవకాశం దక్కలేదు. జైలు రోడ్డులో వెళ్లే వాళ్లలో ఆవేదన కనిపించేది. పది మంది గుమిగూడి, హడావుడి కనిపిస్తే.. 'బాబు బయటకు వస్తున్నారా' అనే ప్రశ్న వినిపించేది. చిన్న పనులు చేసేవాళ్ల దగ్గర నుంచి ఐటీ ఉద్యోగుల వరకూ విదేశాలు, వివిధ రాష్ట్రాల నుంచి రాజమండ్రి వచ్చి జైలు గోడలవైపు దీనంగా చూస్తూ నిశ్శబ్దంగా ఆవేదన చెందేవారు. చంద్రబాబు సతీమణికి మనోధైర్యం చెప్పి బరువెక్కిన గుండెలతో వెనుదిరిగేవారు. నిర్మాణానికి తాను సీఎంగా ఉన్నప్పుడు నిధులు మంజూరు చేసిన 'స్నేహ బ్లాక్' 53 రోజులు మౌనంగా రోదించింది. ఇప్పుడు అక్రమార్కుల రాక కోసం ఎదురుచూస్తోంది నిశ్శబ్దంగా..



బీజేపీ ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతున్న దగ్గుబాటి పురందేశ్వరి

మిత్రపక్షంగా ఉంటూ ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి : పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్5: ప్రభుత్వంలో, కూటమిలో మనం మిత్రపక్షంగా ఉంటాం. కానీ ఎప్పటికప్పుడు ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉంది అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీగా గెలుపొందిన దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో రాజమండ్రి పార్లమెంట్ పరిధిలోని ముఖ్యనాయకులు, మండల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన గెలుపునకు కృషి చేసిన పార్టీ కేడర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో బీజేపీ, తెలుగుదేశం, జనసేన మూడు పార్టీలు కూటమిగా రావడం జరిగిందని, మూడు పార్టీల ఆలోచనా విధానాలు వేరైనా అద్భుతమైన సమన్వయంతో అనూహ్య ఫలితాలు సాధించగలిగామన్నారు. కూటమి పార్టీల సమన్వయం ఒక కేస్ స్టడీగా మనందరం తీసుకోవాలి అని గట్టిగా భావిస్తున్నానన్నారు. గత ప్రభుత్వంలో ప్రతిపక్ష సభ్యులను అసెంబ్లీకి రానీయకుండా, వారిని మాట్లాడనీయకుండా ఒక రకమైన వాతావరణం అసెంబ్లీలో కల్పించారు. ఇవాళ అసెంబ్లీలో ప్రతిపక్షం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మనమే ప్రతిపక్షంగా ప్రజలతో ఉంటూ, వారి సమస్యలను నిర్మాణాత్మకంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కచ్చితంగా ఉందన్నారు. మనకు పది అసెంబ్లీ సీట్లు ఇస్తే అందులో 8 గెలిచామని, ప్రజలు మనపట్ల విశ్వాసంతో ఓట్లు వేశారనే సంగతి గుర్తుంచుకోవాలని, అలాగే ప్రజల విశ్వాసం, మిత్రపక్షాల సహకారం గుర్తుపెట్టుకోవాలన్నారు. టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు చక్కగా సహకరించారని, బీజేపీ అభ్యర్థులకు సంపూర్ణ సహకారం అందించారన్నారు. ఐదేళ్ల కాలంలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా విస్మరించబడిందని, రాబోయే ఐదేళ్లలో ఎన్‌డీఏ కూటమి రాష్ట్రాభివృద్ధి దిశగా అడుగులు వేసి నిజమైన పాలన రాష్ట్రానికి అందిస్తామని ఆశిస్తున్నానని పురందేశ్వరి పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, కోడూరి లక్ష్మీనారాయణ, రొంగల గోపి, పరిమి రాధాకృష్ణ, కృష్ణభగవాన్ పాల్గొన్నారు.





వైసీపీ అంతిమ యాత్రలో జగన్ దిష్టి బొమ్మను చింపేస్తున్న దృశ్యం

వైసీపీ అంతిమ యాత్ర

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5 : రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభంజనంలో తుడుచుపెట్టుకుపోయిన వైసీపీకి రాజమహేంద్రవరంలో అంతిమయాత్ర జరిపారు. బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తిలక్‌రోడ్డులో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు ఆధ్వర్యంలో జగన్ దిష్టిబొమ్మను ఊరేగించి శవయాత్ర చేశారు. దీన్ని గమనించిన పోలీసులు వెంటనే అడ్డుకున్నారు. తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవీవరప్రసాద్ ఆధ్వర్యంలో కూడా ఫ్యానును బైక్‌కి కట్టి ఈడ్చుకెళ్లారు.

జనం.. భయపడిపోయారు!



- అరాచకాలతో అల్లాడిపోయారు
- పోలింగ్ రోజు కోసం ఎదురు చూశారు
- తండోపతండాలుగా తరలివచ్చారు
- ఓ రైలుకు తొలిసారిగా గ్రీన్ చానెల్
- కసితో వైసీపీని ఇంటికి సాగనంపేశారు
- ఓటుతో వైసీపీకి బోడి గుండు కొట్టేశారు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లలో వైసీపీ నాయకుల అరాచకాలకు జనం భయపడిపోయారు. జగన్ అక్రమాలతో రాష్ట్రం అల్లాడిపోయింది. పోలింగ్ రోజున తండోపతండాలుగా పోలింగ్ స్టేషన్లకు వచ్చిన జనంలో ఓ బెరుకు, బాధ స్పష్టంగా కనిపించింది. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే.. వామ్మో ఇంకేమైనా ఉందా? అనే ఆందోళన సుదూరాల నుంచి కూడా తెలుగు ప్రజలు తరలివచ్చేలా చేసింది. ఎటు చూసినా అరాచకాలు. వైసీపీ నాయకుల బూతు పురాణాలు. శాసనసభ అంటే గౌరవం లేదు. ప్రజలంటే జవాబుదారీతనం లేదు. రాజ్యాంగానికి నీళ్లొదిలేశారు. సొంత రాజ్యాంగానికి తెరతీశారు. 'నేను చెప్పిందే' శాసనం.. ఈ డైలాగు సినిమాకే పరిమితం. ప్రజాస్వామ్యంలో దానికి చోటు లేదు. కానీ అధికారం మదంతో చెలరేగిపోయిన జగన్ ఆ విషయాన్ని తెలుసుకోలేదు. ఎవరు చెప్పినా వినలేదు. రాష్ట్రం కాదు 'నా' రాజ్యం. ప్రజలు కాదు 'మా' బానిసలు అనే పాలను సాగించారు. అభివృద్ధికి అవినీతి చీడ పట్టింది. సంక్షేమం పప్పూ బెల్లమైంది. జగన్ దగ్గర నుంచీ కింది స్థాయి నాయకుల వరకూ ఎలా దోచుకోవాలా? అనే ఆలోచనే తప్ప జనాల బాధలు పట్టించుకున్న దాఖలా లేదు. 'ప్రశ్నిస్తే జైలుకు పంపుతాం.. విమర్శిస్తే హింసిస్తాం..' అనే సూత్రాన్ని అమలు చేశారు. ఇవన్నీ చూస్తూ ఉన్న తెలుగు ప్రజల్లో గుండెలు మండిపోయాయి. పోలింగ్ రోజు కోసం మౌనంగా ఎదురుచూశారు. తండోపతండాలుగా తరలివచ్చి 'ఒక్క వెంట్రుకా పీకలేరు' అని సవాల్ చేసిన జగన్‌తోపాటు వైసీపీకి ఓటుతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బోడిగుండు కొట్టేశారు. ఇక నీ స్వపరిపాలన చాలంటూ ఇంటికి తరిమికొట్టారు. ఈసారి జరిగిన పోలింగ్ సరళి గమనిస్తే.. ఓటరు స్వచ్ఛందంగా తపనతో పోలింగ్ స్టేషనుకు వచ్చినట్టు స్పష్టమవుతోంది. విదేశాల నుంచి లక్షలు వెచ్చించి వచ్చారు. ఐటీ ఉద్యోగులు బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసల కోర్చి వచ్చారు. చంద్రబాబు వస్తే తమకు రాష్ట్రంలోనే ఉపాధి దొరుకుతుందనే ఆశే వారిని నడిపించింది. తమ మంచి భవిష్యత్తు కోసం, ఈసారి దగా పడకూడదని 'ఆయనకే' ఓటు వేశానని ఓ ఐటీ విద్యార్థి పోలింగ్ రోజున వెల్లడించడం గమనార్హం. ఈసారి ఓటర్లను ఎవరూ తరలించలేదు. తగలబడిపోతున్న రాష్ట్రాన్ని ఓటుతో మార్పు తీసుకొచ్చి చల్లార్చాలనే తపన వాళ్లను పోలింగ్ బూత్‌కి వచ్చేలా చేసింది. మండుటెండలో నాలుగు గంటలు నిలబడి మరీ ఓటు మీట నొక్కేలా చేసింది. పోలింగ్ రోజుకు ముందు రెండు రోజుల నుంచీ ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలు, బస్సులు, రైళ్లలో కుంభమేళా, పుష్కరాల మాదిరిగా తరలివచ్చిన జనాలను చూస్తే కసి స్పష్టమవుతోంది. ప్రైవేటు బస్సులు కిరాయికి మాట్లాడుకొని మరీ తరలి వచ్చారు. ఉమ్మడి జిల్లాకు సుమారు వెయ్యి ప్రైవేటు బస్సుల్లో ఓటర్లు వచ్చారని అంచనాలు వినవస్తున్నాయి. ప్రత్యేక బస్సులు వేయకుండా మన ఆర్టీసీని నిలువరించినా.. టీఎస్ఆర్టీసీ అదనంగా బస్సులు నడిపింది. తెలంగాణ నుంచి రానుపోను రోజుకు రూ.30వేల కిరాయి మాట్లాడుకొని మరీ కార్లలో జనం పోలింగ్ స్టేషన్లకు వచ్చారు. భూకంపం వచ్చినా 'మార్పు' రావాల్సిందే.. జగన్ జమానా పోవాల్సిందే.. అనే ఆవేదన ఓటరులో కనిపించింది. దీనికి ఓ గొప్ప ఉదాహరణ ఈ ఘటన. మే 13 పోలింగ్ రోజు. ఎప్పటి మాదిరిగానే నాందేడ్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ పరుగులు పెడుతోంది. అయితే సాధారణ సమయంకంటే 4గంటలు ఆలస్యంగా నడుస్తోంది. దీంతో ప్రయాణికుల్లో కలవరం మొదలైంది. సాయంత్రం 6గంటలలోపుగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లకపోతే ఓటు వేయలేమన్న ఆందోళన బయలుదేరింది. దీంతో ఎన్నికల సంఘానికి, రైల్వే ఉన్నతాధికారులకు.. ఇలా ఎవరికి తోచిన దారిలో వారు ఫిర్యాదు, విన్నపం పంపించారు. ఎన్నికల సంఘం తక్షణమే స్పందించి రైల్వే ఉన్నతాధికారులకు సూచన చేసింది. దాంతో ఆ రైలుకు గ్రీన్ చానెల్ ఏర్పాటుచేస్తూ అప్పటికప్పుడు నిర్ణయం తీసుకున్నారు. గూడ్స్‌రైళ్లను పక్కన పెట్టి ఆ రైలును పరుగులు పెట్టించారు. దీంతో సాయంత్రం 4.30గంటల ప్రాంతంలో విశాఖ చేరుకొంది. ఇది రైల్వే చరిత్రలోనే అరుదైన ఘటన. ఎన్నికల పోలింగ్ రోజున ఓ రైలుకు గ్రీన్ చానెల్ ఏర్పాటుచేయడం బహుశా ఇదే మొదటిసారని చెబుతున్నారు. సాధారణంగా పోలింగ్ ముందు, తర్వాత రోజున రైళ్లలో కాస్త ఎన్నికల రద్దీ కనిపిస్తుంది. కానీ, ఈసారి మాత్రం పోలింగ్ ముందు రోజు నుంచి రద్దీ ప్రారంభమైంది. తర్వాత వారంపాటు తిరిగి వెళ్తున్న ఓటర్లతో రైళ్లు కిక్కిరిసిపోయాయి. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై.. ఇలా ఏ వైపు వెళ్లే రైలు చూసినా నిండుకుండలా ఉండేది. సాధారణంగా రాజమహేంద్రవరం రైల్వే స్టేషనులో సాధారణ (రిజర్వేషను టికెట్లు కాకుండా) టికెట్ల ద్వారా సరాసరి 4వేల మంది ప్రతి రోజు ప్రయాణిస్తుండగా రూ.5-7లక్షల వరకూ ఆదాయం ఉంటుంది. కానీ, పోలింగ్‌కి ముందు 9న ఆదాయం అమాంతంగా రూ.8 లక్షలకు చేరుకొంది. 10న రూ.15లక్షలు, 11న 10లక్షలు 12న 8.50లక్షలు నమోదు కాగా.. పోలింగ్ రోజైన 13న ఏకంగా రూ.11లక్షలకు చేరుకొంది. ఇదే ధోరణి వారంపాటు కొనసాగింది. 14న రూ.12లక్షలు, 15న రూ.14లక్షలు, 16న రూ.13లక్షలు, మే 17 శుక్రవారం కావడంతో కాస్త తగ్గి రూ.9.5లక్షలు, 18న రూ.12లక్షలు, 19న రూ.10లక్షలు, 20న రూ.10లక్షలు సాధారణ టికెట్ల అమ్మకాలు జరిగాయి.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

నల్లజర్ల మండలంలోనే అత్యధిక మెజార్టీ

నల్లజర్ల, జూన్ 5: గోపాలపురం నియోజక వర్గంలో కూటమి అభ్యర్థి మద్దిపాటికి నల్లజర్ల మండలం నుంచే అత్యధిక మెజార్టీ వచ్చింది. నల్లజర్ల 8,884, దేవరపల్లి 7,234, ద్వారకాతిరుమల 5,818, గోపాలపురం 4,591 మెజార్టీ, నల్లజర్ల మండలంలో మంటావారిగూడెంలో 825 మెజార్టీ, దూబచర్ల 531, నల్లజర్ల 1091, ఆవపాడు50, ప్రకాశరావుపాలెం 520, పుల్లలపాడు 103, ముసుళ్ళకుంట 79, సింగరాజుపాలెం 420, జగన్నాధపురం 64, మారెళ్ళమూడి 152, పోతవరం1445, అనంతపల్లి 1574, పడమ ర చోడవరం మైనస్ 92, చీపురుగూడెం మైనస్58, అచ్చన్నపాలెం10, అయ్యవరం 42, పోతినీడుపాలెం 142, మెజార్టీ వచ్చింది.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లజర్ల, జూన్ 5: ప్రతి విద్యార్థి స్థానిక గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు అన్నారు. నల్లజర్ల శాఖ గ్రంథాలయం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ గ్రంథాలయ పఠనం ద్వారా ఎంతో విలువైన విజ్ఞానం అందుతుందన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధపడే విద్యార్థులు సైతం గ్రంథాలయంలో ఉచితంగా అందించే స్టడీ మెటీరియల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు రమణ, రిసోర్స్ పర్సన్ యస్‌కే ఖాన్ పాల్గొన్నారు.

సోమేశ్వరుడికి మాస శివరాత్రి పూజలు



నిడదవోలులో విశేష పూజలందుకున్న సోమేశ్వస్వామి

నిడదవోలు, జూన్ 5: నిడదవోలు పట్టణంలో వున్న బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాస శివరాత్రి సందర్భంగా తెల్లవారుజాము నుంచి విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాకుళపు లక్ష్మీ నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో సోమేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన విశేష అభిషేకాలు అమ్మవారికి కుంకుమ పూజలు సహస్రనామాలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున స్వామి అమ్మవార్లను దర్శించు కుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్ని ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహ ణాధికారి సోమాల శివ పర్యవేక్షించారు.

ఫొటో సిహెచ్ 2. చాగల్లు అభయాంజనేయస్వామి వారి జయంతి ఉత్సవాలు సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

వైభవంగా అభయాంజనేయస్వామి జయంతి



చాగల్లు, జూన్ 5 : స్థానిక సెంటర్‌లోని శ్రీఅభయాంజనేయస్వామివారి జయంతి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఐదవ రోజు స్వామివారి ఉత్సవాలలో భాగంగా నిమ్మకాయలతో అష్టోత్తర పూజ నిర్వహించారు. అనంతరం భజన కాలక్షేపం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారి విగ్రహం పరిసర ప్రాంతాల్లోను విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. శ్రీఅభయాంజనేయ సేవాసంఘం వారు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న గౌతమీ నేత్ర వైద్యులు

తాళ్ళపూడి, జూన్ 5: తాళ్ళపూడి బస్టాండు సెంటరు వద్ద గల ఆర్యవైశ్య సత్రంలో బుధవారం ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆర్యవైశ్య ప్రముఖులు సింహాద్రి జనార్ధనరావు ప్రారంభించారు. మండల ఆర్యవైశ్య సంఘం, వాసవీ హెల్పింగ్ హ్యాండ్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరానికి కంటి వైద్య పరీక్షల నిమిత్తం 68 మంది హాజరయ్యారు. వీరిలో 20 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించగా 10 మందికి ఉచితంగా ఆపరేషన్లకు పంపించినట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రాజమండ్రి గౌతమీ నేత్ర వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో గోకవరపు బాబులు, కంకిపాటి వినయ్, అనంతం సాయి, మణికంఠలు తమ సేవలు అందించారు.

పిడుగుపడి గేదె మృతి



తాళ్ళపూడి, జూన్ 5: తాళ్ళపూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలో బుధవారం పిడుగుపడి గేదె మృతి చెందింది. వనమాల రమణ అనే రైతు పొలం పనుల నుంచి ఇంటికి గేదెను తోలుకు వస్తున్న సమయంలో ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురుస్తున్న సమయంలో తన కళ్ల ముందు నడుస్తున్న గేదెపై పిడుగు పడటంతో దారిపక్కనే గల గోతులో పడి చనిపోయిందని తెలిపారు. సుమారు లక్షా యాభైవేల రూపాయల విలుగ గల గేదె చనిపోవడంతో రైతు బోరుమని విలపిస్తున్నాడు.

పిడుగుపాటుకు స్పృహ కోల్పోయిన వ్యక్తి



రాజమహేంద్రవరం ప్రభుత్వం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పసలపూడి రాజేష్

గోపాలపురం, జూన్ 5: నైరుతిరుతుపవనాల రాకతో బుధవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆకాశంలో భారీశబ్దాలు ఏర్పడి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం సమీపంలో మంచినీటి కుండీ వద్ద చేతులు కడుక్కుంటున్న పసలపూడి రాజేష్‌కు సమీపంలో పడింది. దీంతో పసలపూడి రాజేష్ స్పృహకోల్పోయి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించినప్పటికీ శ్వాసతీసుకోక పోవడంతో మెరుగైన వైద్యంకోసం 108వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వం ఆసుపత్రి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అందుబాటులో పాఠ్యపుస్తకాలు



పుస్తకాల స్టాక్‌ను పరిశీలిస్తున్న పాఠశాలల విద్యాశాఖ అధికారి వాసుదేవరావు

చాగల్లు, జూన్ 5 : పాఠశాలలు తెరిచే రోజుకే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేసేలా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పాఠశాలల జిల్లావిద్యాశాఖ అధికారి కే.వాసుదేవరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎంఈవో ఆఫీసులోని పాఠ్యపుస్తకాల స్టాక్‌ను ఆయన పరిశీలించారు. స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పంపిణీ చేసేందుకు వీలుగా కిట్‌లను క్రమపద్ధతిలో ఉంచుకోవాలని చూచించారు. కార్యక్రమంలో ఎంఈవో 2 శుభాకర్ పాల్గొన్నారు.

పోలీస్ పికెట్ ఏర్పాటు

దేవరపల్లి, జూన్ 5 : 2024సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన హింసాత్మక సంఘటనలు దృష్టిలో పెట్టుకుని అన్ని పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థుల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటుచేసి ముళ్ళకంచెలు ఏర్పాటు చేసి పోలీసులు కాపలాగా ఉన్నారు. దేవరపల్లిలో కొవ్వూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు ఇంటి వద్ద, యర్నగూడెంలో మాజీ మంత్రి తానేటి వనిత ఇంటి వద్ద ముళ్ళకంచె ఏర్పాటు చేసి పోలీసులు రక్షణగా ఉన్నారు. గ్రామాల్లో ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు మండలంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.



దేవరపల్లిలో తలారి వెంకట్రావు ఇంటి ముందు ముళ్ళ కంచె ఏర్పాటు చేసిన పోలీసులు



పెరవలి: శేషారావును కలిసి అభినందిస్తున్న తీపర్రు నాయకులు, కార్యకర్తలు



రాజంపాలెంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాకర్ల రామతులసి, మహిళలు



తాళ్లపూడి: వర్షంలో సైతం విజయోత్సవంలో టీడీపీ నాయకులు

గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలి

● మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

● టీడీపీ విజయోత్సవంలో నాయకులు

పెరవలి, జూన్ 5: ఆయా గ్రామాల్లో టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు గ్రామాల అభివృద్ధి వైపు దృష్టి సారించి కలిసికట్టుగా పని చేయాలని నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి విజయం సాధించడంతోపాటు నిడదవోలు అసెంబ్లీ నుంచి ఉమ్మడి అభ్యర్థిగా ఘన విజయం సాధించడానికి కృషిచేసిన బూరుగుపల్లి శేషారావును కలిసి కృతజ్ఞతలు తెలియజేయడానికి, అభినందించడానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం శేషారావును కలిశారు. ఈ సందర్భంగా తనను కలిసిన వారితో శేషారావు మాట్లాడుతూ గత ఐదేళ్ల పరిపాలనలో రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలా మారిందని గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు నిలిచిపోయి గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయని పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసినందున త్వరలోనే ప్రభుత్వం అధికార పగ్గాలు చేపడుతుందని అభివృద్ధి సంక్షేమ పథకాలు వైపు దృష్టి సారిస్తుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో ఏ విధమైన సమస్యలు ఉంటే ఎమ్మెల్యేగా ఎన్నికైన కందుల దుర్గేష్ దృష్టికి తన దృష్టికి తీసుకురావాలని ప్రభుత్వం నుంచి తగిన సహకారం కోరి గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దామని ఆయనను కలిసిన వారిలో మండలం టీడీపీ నాయకులు అతికాల రామకృష్ణమ్మ, బొడ్డు రామాంజనేయులు, సలాది కృష్ణమూర్తి, వాకలపూడి వీర్రాజు, అబ్బిశెట్టి సత్తిరాజు, హనుమంతు సుబ్రహ్మణ్యం, నల్లాకుల వెంకటేశ్వరరావు, కారుమూరి శేషు, కంటిపూడి సూర్యనారాయణ, నందమూరి నారాయణరావు, తదితర నాయకులు ఉన్నారు.

కూటమి అభ్యర్థి ముప్పిడి విజయంతో సంబరాలు

తాళ్ళపూడి, జూన్ 5 : తాళ్ళపూడి మండలంలో పలు గ్రామాల్లో ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు విజయం సాధించడంతో మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పలు గ్రామాలలో ఘనంగా సంబరాలు జరుపుకున్నారు తాళ్ళపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు ఆధ్వర్యంలో తాళ్ళపూడి మెయిన్‌రోడ్‌లో భారీగా నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ ని నిర్వహించారు. జనసేన మండలాధ్యక్షుడు గంటా కృష్ణ ఎంపీ పురందేశ్వరిని కలిసి అభినందనలు తెలిపి పుష్పగుచ్ఛాన్ని అందించా రు. అన్నదేవరపేటలో అల్లూరి విక్రమాదిత్య నివాసం వద్ద భారీ కేకును కట్ చేశారు. కార్యక్రమంలో కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, కలిశెట్టి సన్యాసి నాయుడు, అయితం మణికంఠ, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండల సీనియర్ టీడీపీ నాయకులు కొరారు వెంకట్రావు సమక్షంలో విజయోత్సవ వేడుకలు నిర్వహి ంచారు. కార్యక్రమంలో షైనం గంగరాజు, సుబ్బు, సన్యాసిరావు, బంగారుబాబు పాల్గొన్నారు.



కొవ్వూరు జవహార్ కార్యాలయంలో కేకును కట్ చేస్తున్న జవహార్



ఎంపీ విజేత పురంధేశ్వరికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న జనసేన మండలాధ్యక్షుడు గంటా కృష్ణ

భారీ వానలో సైతం టీడీపీ సంబరాలు

తాళ్ళపూడి మండలంలో పలు గ్రామాలలో ఉరు ములు, మెరుపులతో భారీగా వర్షం కురవడంతో ప్రజలు కాస్తంత ఊపిరి పీల్చుకున్నారు. గత కొద్దిరోజులుగా వేడిగాలులు, వడగాల్పు లతో ఎన్నో ఇబ్బందులు పడిన ప్రజలకు భారీగా వర్షం కురవడంతో సేదతీరారు. భారీ వర్షంలో సైతం టీడీపీ సంబరాలు జరుపుకుం టూనే ఉన్నారు. మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో యువ గళం టీం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విజయోత్సవ సంబరాలు వర్షాన్ని సైతం లెక్కచేయకుండానే నాయకులు, కార్యకర్తలు వర్షంలో తడుస్తూనే నిర్వహించారు. కార్యక్రమంలో హనుమంతరావు, కృష్ణమోహన్, సత్యేంద్ర, భరత్, గణపతి, అబ్బు, లక్ష్మణరావు, బాల కృష్ణ, ఆదిత్య, శివ, జగన్, పండు, జాన్ ప్రసాద్ పాల్గొన్నారు.

జవహార్ కార్యాలయంలో విజయోత్సవ కార్యక్రమం

కొవ్వూరు, జూన్ 5: ఐదు సంవత్సరాల ప్రజా వ్యతిరేక పరిపా లనకు ప్రజలే చారిత్రత్మక తీర్పు ఇచ్చారని అనుభవం కలిగిన నాయకునికి పట్టం కట్టారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె ఎస్ జవహార్ అన్నారు. బుధవారం కొవ్వూరు పట్టణంలోని జవహార్ కార్యాలయంలో విజయోత్సవ కార్యక్రమం జరిపారు. రాష్ట్రంలో టీడీపీ అపూర్వ విజయం సాధించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ నాయకుల సమక్షంలో జవహార్ కేకును కట్ చేశారు. ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలంతా ఎన్‌డీఏ కూటమిని అఖండ మెజారిటీతో గెలిపించారని ప్రజలందరి ఆకాంక్షను అనుసరిస్తూ సుపరిపాలన ప్రారంభం కానుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని తీర్చిదిద్దనున్నారని తెలిపారు. కార్యక్రమంలో పసలపూడు సుభాష్ చంద్రబోస్, నందమూరి భద్ర, కోడూరి ప్రసాదు పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

గోపాలపురం, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్న టీడీపీ జాతీయ అధినేత చంద్రబాబు చిత్రపటానికి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి ఆధ్వర్యంలో బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రామతులసి మాట్లాడుతూ గత ఏడాది రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడులో ప్రక టించిన సూపర్ 6పథకాలు మహిళలు ఆకర్షితులయ్యారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ధరల ధరాగాతంతో నిత్యావసర సరుకులు కొనలేక ఇబ్బందులు ఎదుర్కొన్న మహిళలు చంద్రబాబుకు ఏకపక్షంగా పట్టంకట్టారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ తరఫున పోటీచేసే ప్రతీ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించి టీడీపీని అధికా రంలోకి తెచ్చారని అన్నారు. మహిళలను అగౌరవ పరిచి వ్యక్తి త్వాన్ని హననం చేసేలా మాట్లాడిన ప్రతీ వైసీపీ అభ్యర్థికి ప్రజలు చిత్తుగా ఓడించారని అన్నారు. అధినేత చంద్రబాబుపై మహిళలకు ఏర్పడిన నమ్మకంతో రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ సునామీ సృష్టించిం దన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు. అదే విధంగా గోపాలపురంలోని ఉప్పరగూడెంలో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మండల అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు కూనపం ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొంతా కిషోర్ పాదయాత్ర

కొవ్వూరు, జూన్ 5 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని భక్తితో మొక్కుకున్నానని మొక్కును తీర్చుకునేందుకు పాదయాత్ర చేస్తున్నానని దళిత నాయకులు బొంతా కిషోర్ అన్నారు. బుధవారం కొవ్వూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద బొంతా కిషోర్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రకు టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బొంతా కిషోర్ మా ట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలన అంతమొంది తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాతకు మొక్కుకున్నానని పార్టీ కార్యాలయం నుంచి కాలినడకన గౌరీపట్నం వెళ్లి మొక్కు తీర్చుకుంటున్నట్లు తెలిపారు. పాదయాత్రకు కాపవరం గ్రామంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, అనుపిండి చక్రధర రావు, మాజీ ఏఎంసి చైర్మన్ ఆళ్ళ హరిబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కేతా సాహెబ్, మరపట్ల కళాధర చక్రవర్తి, కొక్కిరిపాటి నరేష్, నాగు, పెద్దమూతి రాజేష్, మెరుపు బాబు తదితరులు పాల్గొన్నారు.



బొంతా కిషోర్ పాదయాత్రను ప్రారంభిస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

ఇది ప్రజా తీర్పు

● కొవ్వూరు ఎమ్మెల్యే విజేత ముప్పిడి వెంక టేశ్వరరావు

కొవ్వూరు, జూన్ 5: జరిగిన ఎన్నికల ఫలితాలలో జగన్మోహన్‌రెడ్డి పరిపాలనపై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా ప్రజలు చూపించారని సంక్షేమాన్ని అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వానికి ప్రజాతీర్పు స్పష్టంగా కనిపించిందని టీడీపీ కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంక టేశ్వరరావు అన్నారు. అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన ముప్పిడికి పార్టీలోని నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలతో ముంచెత్తారు. ఈ మేరకు కొవ్వూరు పట్టణ పార్టీ కార్యాలయంలో పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలుపుతూ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎవ్వరికీ జగన్‌రెడ్డి న్యాయం చేయలేకపోయాడని ప్రజల ఆకాంక్షలను విస్మరించిన పార్టీకు ప్రజలు ఒక గుణ పాఠం చెప్పారని తెలిపారు. విజయానికి పాటుపడిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు అభిమానంతో ఓట్లు వేసిన ప్రజలందరికీ ముప్పిడి వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబుని కలిసిన మద్దిపాటి



ఉండవల్లిలో టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, జూన్5: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు ఆంధ్ర రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఉండవల్లి నివాసంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా కాబోయే ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతతో కూడిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన చరవాణిలో మాట్లాడుతూ తమ అధినేత తనను నమ్మి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారని అధినేత నమ్మకాన్ని నిలబెడుతూ నియోజకవర్గ ప్రజలతో మమేకమై విజయం సాధించి ఆయన నమ్మకాన్ని నిలబెట్టారని అన్నారు. అందర్నీ కలుపుకుని నాయకుడిగా కాక సేవకునిగా నియోజకవర్గ ప్రజలకు సేవ అందించటమే తన లక్ష్యమన్నారు. తమ అధినేత ఆశీస్సులతో నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజక వర్గంగా తీర్చిదిద్ది అభివృద్ధి పథంలో నడిపించ డానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. అలాగే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు రుణపడి ఉంటా

● గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



నల్లజర్లలో నాయకులు, కార్యకర్తలతో మద్దిపాటి వెంకట్రాజు

నల్లజర్ల, జూన్ 5 : ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తలకు, గోపాలపురం నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. బుధవారం నల్లజర్ల పార్టీ కార్యాలయంవద్ద స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌పై ఎంతో నమ్మకం ఉందన్నారు. నియోజక వర్గంలో ప్రజలందరికి సేవ చేసే భాగ్యం కల్పించినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఆయన వెంట మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్‌యద్దనపూడి బ్రహ్మరాజు,పసుమర్తి రతీష్, యలమాటి శ్రీనివాసరావు, కండెపు వెంకటరత్నం, నిమ్మలపూడి ప్రసాద్, ఘంటా శ్రీను ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావ రణ పరిరక్షణ అందరి బాధ్యతని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్క రించుకొని జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలన్నారు. పర్యావరణానికి హాని కలిగిస్తే భవిష్యత్తు తరాల మనుగడ ప్రమాదంలో పడుతుందన్నారు. కార్యక్రమంలో శాశ్వ త లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.గాయత్రి దేవి, ప్రిన్సిపల్ అండ్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ, ఎంసీపీసీ సీనియర్ ట్రైనర్స్ వినయ్‌కుమార్ గుప్తా, సునీల్ కుమార్ అగర్వాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.వీరేంద్రనా థ్, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న పీడీజే గంధం సునీత

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

● ప్రపంచ పర్యావరణ దినోత్సవం

కొవ్వూరు, జూన్ 5 : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని కొవ్వూరు ఆంధ్రాషుగర్స్ కర్మాగారంలో వైభవంగా జరుపుకున్నారు. గోదావరీ తీరంలో పలు రకాల మొక్కలను ఫ్యాక్టరీ మేనేజరు ఈ.వి. కృష్ణారా వు నాటారు. ఆయన మాట్లాడుతూ నేల పునరుద్ధరణ, కరువును అధిగమిండం ఈ సంవత్సరపు థీం అని మన భూమి మన భవి ష్యత్తు అని దీనిని రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఫాక్టరీలో కాలుష్య నివారణకు ప్రభుత్వం కాలుష్య నివారణ మండలి నిర్దేశించిన ప్రమాణాలను పాటిస్తూ పర్యావరణాన్ని రక్షిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆంధ్రాషుగర్స్ సగ్గొండ అడిషనల్ జనరల్ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ ఈ నేలను కాపాడుకోవడం ఆవశ్యకత అని అలాగే చెట్లను కూడా కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కెమిస్టు టి.హరిశ్చంద్రప్రసాదు, చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కెవివి సత్యన్నారాయణమూర్తి, అసిస్టెంట్ జీఎం హెచ్‌ఆర్ సీహెచ్ మహర్షి పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎంఈవోలు సీహెచ్ సక్సేనరాజు, డి.శారదాజ్యోత్స్న పేర్కొన్నారు. బుధవారం స్థానిక హైస్కూలులో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మొక్కలు నాటా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడం వలన మానవునికి ప్రాణదాతగా నిలుస్తాయని ఎంఈవోలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.మాణిక్యాలరావు, ఉపాధ్యాయులు కోట రామ ప్రసాద్, పి.నిరీక్షణరాజు, బి. పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.



కొవ్వూరులో మొక్కను నాటుతున్న ఫ్యాక్టరీ మేనేజరు కృష్ణారావు

ఉండ్రాజవరంలో మొక్కలు నాటుతున్న ఎంఈవో



సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	లవ్ మీ
వై.స్క్రీన్2	గంగం గణేశా
దేవిశ్రీ(గాయత్రి)	భజే వాయువేగం
అనన్య	గ్యాంగ్ ఆఫ్ గోదావరి
నిడదవోలు	
వీ మ్యాక్స్	గంగం గణేశా
రాధాకృష్ణ	భజే వాయువేగం
శ్రీగణపతి	గ్యాంగ్ ఆఫ్ గోదావరి
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	గంగం గణేశా